
ఆంధ్రజ్యోతి



నా పిత్రార్జిత భూమి...

ప్రభుత్వ రికార్డుకెక్కించారు!



మీడియాతో మాట్లాడుతున్న భాస్కరరెడ్డి

పరిశీలించి న్యాయం చేయండి

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన ఆత్మకూరు కౌన్సిలర్

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తనకు పిత్రార్జితంగా సక్రమించిన భూమిని అధికారులు ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో చేర్చారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ ఆత్మకూరు లోని 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కరరెడ్డి సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఆత్మకూరు మండలం నాగులపాడు మధిర చెర్లోఎడవల్లిలో భాస్కరరెడ్డికి పిత్రార్జితం ద్వారా 1.24 ఎకరాల పొలం సక్రమించింది. అయితే ఈ భూమిని ప్రభుత్వ భూమిగా రికార్డులలో నమోదు కావటంతో దానిని తొలగించాలంటూ తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగాడు. పలుమార్లు తిరిగిన తర్వాత ఆ ఫైల్‌ను కలెక్టరేట్‌కు పంపారు. కలెక్టరేట్‌కు ఫైల్ వచ్చి నాలుగు నెలలైనా, 17 సార్లు కలెక్టరేట్ చుట్టూ తిరిగినా, తన సమస్య పరిష్కారం కాలేదని భాస్కరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కౌన్సిలర్‌కే కష్టం

ఉద్యాన రైతులకు ప్రోత్సాహక రాయితీలు

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోత అనంతరం యాజమాన్య పథకం కింద కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ రూం, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా 35 నుంచి 40శాతం వరకు రాయితీ అందిస్తున్నట్లు ఆ శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పండ్లు, కూరగాయలు, పూలను సేకరించి గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ చేసేందుకు ఉపయోగపడే కలెక్షన్ సెంటర్ నిర్మాణానికి రూ.15లక్షలు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఇందులో రూ.5.25 లక్షల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. అదేవిధంగా పంటను ఎక్కువ రోజులు నిల్వ చేసేందుకు ఉపయోగపడే కోల్డ్ రూము నిర్మాణానికి రూ.12.5 లక్షలు ఖర్చవుతుండగా, రూ.5లక్షల వరకు, మినిమల్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి రూ.25 లక్షలు ఖర్చవుతుండగా, రూ.10 లక్షల వరకు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

బోగస్‌పై ఫోకస్

- అనర్హులను తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం
- ఇంటింటి సర్వేకు పైలట్ గ్రామంగా చెంచుగానిపాలెం
- పది ప్రత్యేక బృందాలతో వివరాలు సేకరణ
- ఫిర్యాదుల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చర్యలు

నెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బోగస్ పింఛన్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ విచ్చలవిడిగా అనర్హులకు పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ఆస్తులున్నా లేనట్టుగా చూపడం, దివ్యాంగులు కాకపోయినా ఆ కోటాలో పింఛన్లు పొందడం వంటి అనేక వ్యవహారాలు ఆధారాలతో సహా ఫిర్యాదులు వెళుతున్నాయి. అదే సమయంలో రాజకీయ కక్షలతో అర్హులకు పింఛన్లు తొలగించినట్లు కూడా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో పింఛన్లపై సర్వే చేయాలని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పింఛన్ అందుకుంటున్న వారి అర్హత వివరాలను పరిశీలించాలని నిర్ణయించింది. తొలుత జిల్లాకు ఒక గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా సర్వే చేయాలని భావించింది. ఆ సర్వేలో వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ మేరకు సెర్ప్ సీఈవో నుంచి కలెక్టర్‌కు ఉత్తర్వులు అందాయి. జిల్లాలో కావలి మండలం చెంచుగానిపాలెం గ్రామాన్ని పైలట్ గ్రామంగా తీసుకొని ఆ గ్రామంలోని పింఛన్‌దారుల అర్హతపై సర్వే చేయాలని ఆదేశించారు. సోమ, మంగళవారాల్లో ఈ సర్వేను పూర్తి చేసి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పింఛన్ల యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సెర్ప్ సీఈవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

● రంగంలోకి ప్రత్యేక బృందాలు

చెంచుగానిపల్లిలో సర్వేకు కలెక్టర్ ఓ ఆనంద్.. పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక ఈవోపీఆర్‌డీ, ఒక జూనియర్ లేదా సీనియర్ అసిస్టెంట్ ఉంటారు. వింజమూరు, జల దంకి, కలిగిరి, కందుకూరు, ఉలవపాడు, బోగోలు, దగదర్తి, అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాలకు చెందిన ఈవోపీఆర్‌డీలు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు విచారణ బృందాల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ సర్వేను కావలి డీఎల్‌డీవో పర్యవేక్షిస్తున్నారు. చెంచుగాని పల్లిలో మొత్తం 396 పింఛన్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఒక్కో విచారణ బృందం 40 పింఛన్లు సర్వే చేసే విధంగా విభజించారు. సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో ఈ బృందాలు సర్వే ప్రారంభించాయి. పింఛన్‌దా రుడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ వివరాలు, ఆస్తుల వివరాలను విచారి స్తున్నారు. దివ్యాంగుల కోటాలో పింఛన్ తీసుకుంటుంటే.. నిజంగా వారు దివ్యాంగులా? కాదా? అన్నది పరిశీలిస్తారు. అలానే ఆ గ్రామంలో కూడా పింఛన్‌దారుడి గురించిన వివరాలు తెలుసుకుంటారు. కాగా ప్రస్తుతం జిల్లాలో 3,09,997 మంది వివిధ కోటాలో పింఛన్లు అందుకుంటున్నారు. వీరికి ప్రతి నెలా రూ.131.62 కోట్లను ప్రభుత్వం చెల్లిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో కొత్త పింఛన్లు మంజూరు చేయగా వాటిల్లో చాలా వరకూ అనర్హమైనవి ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివిధ కేటగిరీల్లో నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ సానుభూతిపరులకు పింఛన్లు మంజూరు చేసినట్లు అనేక ఫిర్యాదులున్నాయి. ఇప్పుడు క్షేత్రస్థాయి సర్వే పూర్తయ్యాక వాస్తవాలు తేలనున్నాయి.



కావలి రూరల్ : చెంచుగానిపాలెంలో పింఛన్లు తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందాలు

బకాయిలు 163 కోట్లు

- పన్ను వసూళ్లకు కార్పొరేషన్ అధికారుల విశ్వప్రయత్నం

వసూలు 40 కోట్లే!

- మొండి బకాయిదారులకు 'రెడ్ నోటీసులు'
- అయినా స్పందించకుంటే విద్యుత్ సర్వీసుల కట్

నెల్లూరు నగర పాలక సంస్థకు ప్రధాన ఆదాయ వనరైన పన్ను వసూళ్ల పై ఆ సంస్థ దృష్టి సారించింది. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో మొండి బకాయిలు వసూళ్లు చేయాలన్న నిర్ణయానికి ఉన్నతాధికారులు వచ్చారు. గత కొన్నేళ్లగా రూ.92.58 కోట్ల పన్నుబకాయిలు పేరుకుపోగా, తాజాగా మరో రూ.71.02 కోట్లు వసూలు కావాల్సి ఉంది. మొత్తంగా రూ.163.06 కోట్లు కార్పొరేషన్ ఖజానాకు చేరాల్సి ఉండగా అందులో ఇప్పటి వరకు రూ.40 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు. మిగిలిన రూ.123.06 కోట్ల వసూలుకు ఆర్ఐ, ఆర్వోల ద్వారా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మొండి బకాయిదారులను గుర్తించి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నా స్పందించకపోతే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.

నెల్లూరు (సిటీ), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని 166 సచివాలయాల ద్వారా 1.34 లక్షల అసెస్‌మెంట్లు, మరో 6,907 ఖాళీ స్థలాల ద్వారా భారీగా ఆర్థిక వనరులు ఎన్ఎంసీ ఖజానాకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కానీ వీటిని వసూలు చేయడంలో కార్పొరేషన్ రెవెన్యూ విభాగం ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు గుప్పుమనడంతో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్వయంగా రంగంలోకి దిగారు. ఆయన నెల్లూరుకు వచ్చినప్పుడల్లా కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించి వసూళ్లపై ఆరా తీస్తున్నారు. కమిషనర్ సూర్యతేజ కూడా ఆర్ఐలు, ఆర్వోలకు నిత్య టార్గెట్లు విధించి, మొండి బకాయిలను వసూళ్లు చేసే పనిలోపడ్డారు. వారాంతపు రోజుల్లో ప్రత్యేక డ్రైవ్‌లను కూడా నిర్వహిస్తున్నారు. నగరంలోని 54 డివిజన్లలో రూ.163.06 కోట్ల పన్నుల రూపేణా వసూళ్లు చేయాల్సిన భారీ లక్ష్యం ఉండగా, ఇప్పటివరకు సుమారు రూ. 40 కోట్లు మాత్రమే వసూళ్లు చేశారు.



ఇటీవల ఓ భవంతికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

● రెవెన్యూ మార్పునకు బీజం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన రెవెన్యూలో ఆర్వో, ఆర్ఐల బదిలీల వ్యవహారం పన్ను వసూళ్ల వద్దే బీజం పడింది. అటు మంత్రి, ఇటు కమిషనర్‌లు ఎంత హెచ్చరించినా రెవెన్యూ అధికారుల్లో మార్పు రాకపోవడంతో తుది దశలో కఠిన నిర్ణయం తీసుకున్నారు. సమూలంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన కమిషనర్ సూర్యతేజ ఆర్వో, ఆర్ఐలను బదిలీ చేసి శానిటేషన్ బాధ్యతలను అప్పగించారు. ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి లేకపోవడం, సచివాలయాలు, ఆర్ఐల వారీగా వివరాలు అందచేయడంలో జాప్యం చూపుతున్నారన్న కారణంతో రెవెన్యూ ప్రక్షాళనకు బీజం పడిందన్న విమర్శలు ఉన్నాయి.

● పన్నుల వసూళ్లకు కఠిన చర్యలు

మొండి బకాయిదారులకు ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు పురపాలక చట్టంలోని అన్ని మార్గాలను అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే భారీగా పేరుకుపోయిన బకాయిలున్న సంస్థలు, వ్యక్తులను సచివాలయాల వారీగా గుర్తించిన రెవెన్యూ అధికారులు వరుస నోటీసులు ఇచ్చారు. అనంతరం తుది హెచ్చరికగా రెడ్ నోటీసులను జారీ చేశారు. అయినా స్పందన లేకపోవడంతో కొళాయి కనెక్షన్లను కట్ చేసి హెచ్చరించారు. అప్పటికీ కొందరు స్పందించకపోడంతో తాజాగా విద్యుత్ కనెక్షన్లను కట్ చేస్తున్నారు. తదుపరి మరింత కఠినంగా వ్యవహరించేందుకు పురపాలక శాఖ ప్రభుత్వం నుంచి మరిన్ని అనుమతులు తీసుకునేందుకు సిద్ధమైంది.



డిమాండ్ నోటీసులు సిద్ధం చేస్తున్న ఉద్యోగులు



ఎవరికీ మినహాయింపులేదు

నెల్లూరు సిటీని అన్నింటా అభివృద్ధి చేసి ప్రజలకు సకల సౌకర్యాలు సమకూర్చాలంటే డబ్బులు కావాలి. అదంతా పన్నుల రూపేణా రావాల్సిందే. ప్రతి ఒక్కరు పన్ను చెల్లించి తీరాలి. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదు. పన్నులు చెల్లించడం పౌరులు తమ బాధ్యతగా వ్యవహరించాలి.

– సూర్యతేజ, ఎన్ఎంసీ కమిషనర్

'రాళ్లపాడు'లో పూర్తికాని

గేటు మరమ్మతు పనులు

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) : దెబ్బతిన్న రాళ్లపాడు కుడి కాలువ గేటు మరమ్మతు పనులు సోమవారం సాయంత్రానికి కూడా పూర్తి కాలేదు. ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు, ఏఈలు, సిబ్బంది తూము లోపలకు వెళ్లి గేటుకు తాడు కట్టి పైకి లాగేందుకు ప్రయత్నించారు. రెండు సార్లు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో గేట్ల మరమ్మతు నిపుణుడు బాషా కోసం ఎదురు చూస్తున్నారు. కాగా, గేటుకు సంబంధించిన కొన్ని పరికరాలు తెచ్చేందుకు, మరికొన్ని పరికరాల వెల్డింగ్ పనుల కోసం బాషా ఒంగోలు వెళ్లారు. ఆయన వచ్చాక మంగళవారం ఉదయం నుంచి మరమ్మతు పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కుడికాలువలో నీటి ప్రవాహం లేకపోవడంతో వరి నారుమడులు, వరినాట్లు, దుక్కులు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కుడి కాలువ గేటును పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్న యంత్రాంగం

ఇక జాగ్రత్త అవసరం

- గరిష్ఠ మట్టానికి చేరిన సోమశిల
- కొనసాగుతున్న 4,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




అనంతసాగరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నిండుకుండను తలపిస్తూ గరిష్ఠ మట్టానికి చేరుకొంది. దీంతో అధికార యంత్రాగం అప్రమత్తమైంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 73.002 టీఎంసీలు దాటి 74 టీఎంసీలకు చేరువైంది. పైతట్టు ప్రాంతాల నుంచి 4,751 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ఇంజనీర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎగువ నుంచి వచ్చే ప్రతి నీటిబొట్టును ప్రాధ్యానతగా చూడాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాజెక్టు మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుంది. గత వైసీపీ పాలనలో చేసిన తప్పిదాలు పునారావృత్తం కాకుండా నిపుణుల మండలి ఇప్పటికే ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేసింది. అనుకోని రీతిలో ఎగువన భారీ వర్షాలు కురిసి సోమశిలకు వచ్చే వరద స్థాయి పెరిగితే నీటి నిల్వను అంచనా వేసుకొంటూ దిగువకు వదులుకోవాల్సిన అవశ్యకత ఏర్పడినట్లు విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. ఆ దిశగా అప్రమత్తం అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు రానున్న 20 రోజుల్లో వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తుండగా ఇక సోమశిలలో ఎగువ నుంచి వచ్చే భారీ వరదను బట్టి డ్యాం క్రస్ట్‌గేట్లు ఎత్తే అవసరం ఏర్పడనుంది.

● కండలేరుకు ఐదువేల క్యూసెక్కులు

సోమశిల నుంచి కండలేరుకు వరద కాలువ ద్వారా 5000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. మొదటిపంటకు ఉత్తర కాలువ ద్వారా 500, దక్షిణ కాలువ ద్వారా 150 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● 'కండలేరు'లో 55.2 టీఎంసీలు

రాపూరు (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 55.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో 4800 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1795 క్యూసెక్కులు ఉన్నట్లు పేర్కొన్నారు.



నేలకూలిన జెండామాను

ముత్తుకూరు మండలం పల్లెపాడుదిన్నెలో సోమవారం వందేళ్ల నాటి వేపచెట్టు నేలకొరిగింది. సిమెంటు రోడ్డు పక్కనే ఉన్న రచ్చబండ బీటలు వారి వేర్లు బయటపడడంతో ఈ భారీ వృక్షం పడిపోయింది. వందేళ్ల నుంచి జెండా మానుగా పూజలు అందుకుంటున్న ఈ చెట్టు కుప్పకూలడంతో స్థానిక ముస్లింలు ఆశ్చర్యానికిలోను కావడంతో పాటు ఆవేదన చెందారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మట్టి గుల్లబారి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని వారు భావిస్తున్నారు.

- ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి)



మైదానం కాదండోయ్ !

ఈ చిత్రంలో అంతా పచ్చగా కనిపిస్తుంది కదూ... ఇదేదో క్రీడా మైదానం అనుకోకండి. బాగా గమనిస్తే నీళ్లు కూడా కనిపిస్తున్నాయి. మై దానంలోకి వాననీళ్లు వచ్చాయా.. అంటే కా నేకాదు. కనుపూరు కాలువ నుంచి గురి విందపూడి చెరువుకు సాగునీరందించే వరవ కాలువ ఇది. ఇదిగో ఇలా గుర్రపుడెక్క పెరిగి మైదానాన్ని తలపిస్తోంది. గుర్రపుడెక్కను తొలగిస్తే చెరువుకు వేగంగా నీరు చేరే అవకాశం ఉంటుంది. అధికారులు తొలగింపు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

-మనుబోలు, (ఆంధ్రజ్యోతి)



దాహం తీర్చండి సార్!

కోవూరు, డిసెంబరు 9: తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఇనమడుగు మిక్సిడ్ కాలనీకి చెందిన మహిళలు సోమవారం సచివాలయం ఎదుట ఆందోళ న చేపట్టారు. నాలుగైదు రోజులుగా పంచాయతీ సి బ్బంది నిర్లక్ష్యం వల్ల తమకు తాగునీటి సమస్య తలె త్తిందని వారు వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరిస్తానని సర్పంచు ప్రమీల హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

రాజకీయాల్లోనే ఉంటా..

కూటమి ప్రభుత్వానికి జై!

- మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం

కలువాయి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి రిటైర్డు కావాలనుకున్న తాను రాజకీయాల్లోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ నాయకుడు మాదాసు గంగాధరం అన్నారు. సోమవారం కుల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల తన రాజకీయ జీవితాల్లో ఇప్పటివరకు నాయకుల సిఫారసులతోనే అభివృద్ధి పనులు మంజూరు చేయడం చూసినట్లు చెప్పుకొచ్చారు. అయితే, కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రజల అవసరాలను



విలేకరులతో మాట్లాడుతున్న మాదాసు

గుర్తించి చేస్తున్నారని ఆయన కూటమి ప్రభుత్వ పనితీరును కొనియాడారు. ఇలాంటి ప్రభుత్వానికి నియోజకవర్గంలో ఉన్న తమ అభిమానులంతా కలిసి మద్దతు తెలిపేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ ఇచ్చి చంద్రబాబు రాజకీయ భిక్ష పెట్టగా, పవన్ కల్యాణ్ కూడా తనను ఎంతో అభిమానించే వారని వారితో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. త్వరలో పవన్, లోకేష్, చంద్రబాబుతో మాట్లాడి రాజకీయంగా నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచు అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ జ్ఞాపకాలే..

సేవకు తోవ

అమ్మ జ్ఞాపకాలే.. సేవకు తోవయింది. ఆయన చిన్నతనంలో తల్లి చేస్తున్న సేవా కార్యక్రమాలే నాంది పలికింది. తల్లి మీద ఉన్న ప్రేమతో ఆమె అకాలంగా కాలం తీరినా చేస్తున్న సేవా కార్యక్రమాలు సజీవంగా ఉండాలని తలచాడు. తల్లి జ్ఞాపకార్థం అమ్మానాన్నల పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి మూడు గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రశంసలందుకుంటున్నాడు ఎన్నారై ముత్యాల విజయ చంద్ర.

- తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్..
- మూడు గ్రామాల్లో సామాజిక సేవ
- జంగాలకండ్రిక వాసి విజయచంద్ర దాతృత్వం

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగం మండలం జంగాలకండ్రికకు చెందిన ప్రమీలమ్మకు విడవలూరు మండలానికి చెందిన ముత్యాల మల్లికార్జునరావుతో వివాహమైంది. వీరి కుమారుడు విజయచంద్ర. తండ్రి బ్యాంకు మేనేజర్ కావడంతో చదువు, పెరిగినదంతా నెల్లూరులోనే. వేసవి సెలవులకు తల్లితో కలిసి జంగాలకండ్రికలోగడిపేవారు. ప్రమీలమ్మ తండ్రి గ్రామంలో వీఆర్వో కావడంతో పెళ్లికి ముందే సేవా భావం అలవడింది. తండ్రి మల్లికార్జున బ్యాంక్ మేనేజర్ కావడంతో ఆర్థికంగా ఉన్నారు. దీంతో జంగాలకండ్రికలకు వచ్చినప్పుడల్లా పేదలకు సాయం చేసేవారు. విజయచంద్ర ఇదంతా గమనించేవారు.



మర్రిపాడు ఉన్నత పాఠశాలలో నిర్మించిన తరగతి గది



బాలింతలకు పండ్లు అందజేస్తున్న విజయచంద్ర

అమెరికాలో 12 ఏళ్లు..

నెల్లూరులో ప్రాథమిక విద్య అనంతరం వరంగల్లులో విజయచంద్ర బీటెక్ పూర్తి చేశారు. 2001లో ఎంఎస్ చేసేందుకు అమెరికాకు వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే ఉద్యోగం సంపాదించారు 2006లో స్వగ్రామానికి వచ్చి వివాహ అనంతరం మళ్లీ అమెరికాకు వెళ్లి 12 ఏళ్లపాటు ఉద్యోగం చేసి తిరిగి వచ్చి నెల్లూరుకు వచ్చి స్థిరపడ్డారు.

2021లో తల్లి మృతి..

విజయచంద్ర తల్లి ప్రమీలమ్మ కరోనా మహమ్మారికి గురై 2021లో మృతి చెందారు. తీవ్రమనోవైదనకు గురైన విజయచంద్ర తల్లి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఎంతో మదనపడ్డాడు. తల్లి సేవా గుణాన్ని నిరంతరం నిరంతరం కొనసాగించాలన్న ఉద్దేశంతో తల్లిపేరుతోపాటు తండ్రి పేరు కలిపి ముత్యాల ప్రమీల, మల్లిఖార్జున చారిట్రబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. జంగాలకండ్రికతోపాటు సమీపంలో ఉన్న వంగల్లు, మర్రిపాడు గ్రామాలను ఎంచుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- మర్రిపాడు ఉన్నత పాఠశాలలో మూడు అదనపు గదుల నిర్మాణానికి చేయూత. ఎస్టీ కాలనీల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు అందచేస్తున్నారు.
- జంగాలకండ్రిక, వంగల్లు, మర్రిపాడు గ్రామాల్లోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదింట్లో ఫ్యాన్లు, లైట్లు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.
- అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలకు అందించే పాలు, కోడిగుడ్లు 15 రోజులు సరిపోతాయి. మిగిలిన రోజులు పౌష్టికాహారం లోపం లేకుండా మూడు గ్రామాల్లోని 7 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు సరిపడా నాలుగు రకాల పండ్లను ప్రతి నెలా 15వ తేదీన పంపిణీ చేస్తున్నారు.
- ఎవరైనా పేదలు చనిపోయి అంత్యక్రియలకు సాయం కోరితే ట్రస్ట్ తరఫున ఆర్థిక సాయం అందచేస్తున్నారు.
- గ్రామాలలోని దేవాలయాల్లో జరిగే పర్వదినాల్లో అన్నదానం చేస్తున్నారు.

ఏడాదికి రూ. 10 లక్షలు వెచ్చిస్తా

ప్రతి ఏడాది ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలకు రూ.10 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మూడు గ్రామాల్లో ప్రస్తుతం చేస్తున్న సేవా కార్యక్రమాల తోపాటు నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ, పోటీ పరీక్షలు తీర్చదు కోసం నిధులు వెచ్చిస్తాను. మా అమ్మ పేరుతో సేవ చేసే భాగ్యం దేవుడు కల్పించినందుకు ఆనందంగా ఉంది.

- విజయచంద్ర, ఎన్నారై



ఎస్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం

- ఈనెల 19వతేదీ వరకు నిర్వహణ

నెల్లూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి పరీక్షలు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1ను స్వీయ ముదింపు టర్మ్-1 పేరుతో సోమవారం నుంచి జిల్లాలో ప్రారంభమయ్యాయి. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉండే సంస్కృతం పరీక్షను మాత్రమే నిర్వహించారు. ఈనెల 11వ తేదీ నుంచి అన్ని పాఠశాలల్లో ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు. 1 నుంచి 5వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12న ఇంగ్లీష్, 13న గణితం, 16న ఈవీఎస్ పరీక్షలు ఉంటాయన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు 11న తెలుగు, ఉర్దూ, 12న హిందీ, 13న ఇంగ్లీష్, 16న మ్యాథ్స్, 17న భౌతికశాస్త్రం, 18న జీవ శాస్త్రం, 19న సోషల్ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రాథమిక తరగతుల ప్రశ్నాపత్రాలు స్కూల్ కాంప్లెక్స్‌లకు, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రశ్నాపత్రాలు ఎంఈవో కార్యాలయాలకు చేర్చామన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా తేదీల్లో పరీక్షకు గంట ముందుగా ప్రశ్నాపత్రాలు తీసుకుని పరీక్ష నిర్వహించాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు కూడా షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలల్లో పరీక్ష అనంతరం ఉపాధ్యాయులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఈనెల 22వ తేదీ లోపల మార్కులను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు పంపించడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు.

ఆచార్య శ్రీనివాసరావుకు విశిష్ట పరిశోధకుడి అవార్డు



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

కావలి టౌన్, డిసెంబరు 9: స్థానిక పీజీ కళాశాలలో కామర్స్ విభా గాధిపతి ఆచార్య చిలమూరి శ్రీనివాస రావు విక్రమ సింహపురి యూనివర్సిటీ విశిష్ట పరిశోధకుడు పుర స్కారం అందుకున్నారు. చెన్నైలోని గ్రీన్‌పార్క్ హోటల్‌లో వీనస్ ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ నిర్వాహ కులు సోమవారం నిర్వహించిన పదవ వార్షిక రీసెర్చ్ మీట్‌లో ఈ పురస్కారాన్ని అందజేశారు. పలువురు ప్రముఖులు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

డబుల్ రోడ్డు ఎప్పుడయ్యేనో..!



లింగసముద్రం మీదుగా కొత్తపేట వరకు 14కి.మీ పొడవునా డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు 2018లో రూ.16 కోట్లతో కందుకూరు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపారు. 2019లో ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలను పట్టించుకోలేదు. దీంతో ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నది రోడ్డు పరిస్థితి. ప్రధానంగా మండలకేంద్రంలోని సింగిల్‌రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

హనుమాన్ చాలీసా అఖండ పారాయణం



శబరి శ్రీరామక్షేత్రంలో హనుమాన్ చాలీసా అఖండపారాయణం

నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో హనుమద్రవ్రతం సందర్భంగా విజయవాడ అఖిల భారత హనుమాన్ దీక్షా పీఠం ఆధ్వర్యంలో నిరంతర హనుమాన్ చాలీసా అఖండ పారాయణం సోమవారం ప్రారంభమైంది. తొలుత ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఈ పారాయణం 12వ తేదీ సాయంత్రం వరకు జరుగుతుంది. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీ హనుమద్రవ్రతం కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు శబరి శ్రీరామక్షేత్రం చైర్మన్ చెన్నూరు వెంటేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 6గంటలకు అభిషేకం, 9గంటలకు హనుమద్రవ్రతం హోమం, 10గంటలకు నాగవల్లీదళ (ఆకుపూజ) అర్చన, 11.30 గంటలకు పూర్ణాహుతి జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4గంటలకు శ్రీరామస్తూపంలో భక్తులు రాసిన రామకోటి గ్రంథాల నిక్షిప్తం వేడుకలు జరగనున్నాయి.

- నెల్లూరు(సాంస్కృతికం,ఆంధ్రజ్యోతి)

కేజ్ వీల్స్‌తో రోడ్లు ఛిద్రం



కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడపడంతో దెబ్బతిన్న రోడ్డు

కొందరు ట్రాక్టర్ల యజమానులు నిర్లక్ష్యంగా కేజ్ వీల్స్ తో తారురోడ్డుపై తిరుగు తుండటంతో రోడ్లు ఛిద్రమైపోతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలువాయి నుంచి సీతారాం పల్లి, రామన్నగారిపల్లె, చింతలపాళెం రోడ్డుపై కేజీ వీల్స్‌తో తరచుగా ట్రాక్టర్లు తిరుగుతుండటంతో రోడ్లు అధ్వానంగా తయారై ఇబ్బందులకు గురవుతున్నా మని, అధికారులు తగు చర్యలు తీసుకుని రోడ్లను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కలువాయి (ఆంధ్రజ్యోతి)

అలా వచ్చి.. ఇలా వెళ్లి!

- 'ప్రజావేదిక'లో అధికారుల తీరిది! • ప్రజల్లో సన్నగిల్లుతున్న నమ్మకం

ఆంధ్రజ్యోతి పరిశీలన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే, ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు డుమ్మా కొట్టడంతో తమ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుతిరగాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి 17 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా 11.14 గంటలకు కేవలం 7 శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో వీడియోకాన్ఫరెన్స్ మరమ్మతులకు గురి కావడంతో కార్యక్రమం నిర్వహించలేదు. సమయపాలన పాటించకుండా కొందరు అధికారులు వచ్చామా.. వెళ్లమా.. అంటూ, మరికొందరు తమ సిబ్బందిని పంపి రిజిస్టర్‌లో సంతకాలు చేయిస్తూ మమ అనిపిస్తున్నారు. కొందరు అక్కడ అధికారులు ఉండరు.. అర్జీలు అందజేసినా సమస్యలు పరిష్కారం కావడంలేదంటూ అసలు ఇవ్వడమే మానేశారు.. మరికొందరు తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చినా సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఉదయగిరి : తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పరిష్కార వేదికలో పాల్గొన్న ఏడు శాఖల అధికారులు, సిబ్బంది

- నంగం (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 12 గంటల సమయానికి ఐదు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దారు సోమ్లానాయక్, హౌసింగ్ ఏఈ గౌస్‌మొహిద్దీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఉండగా, డీఆర్‌డీఏ వెలుగు, విద్యాశాఖ అధికారులు మాత్రం సంతకం చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. అగ్రికల్చర్ ఏవో శ్రీహరి ఆలస్యంగా వచ్చి సంతకం చేశారు. మిగిలిన శాఖ అధికారులు హాజరు కాలేదు. ఒకరిద్దరు తప్ప మిగిలిన వీఆర్వోలు అందుబాటులో లేరు. ప్రజల నుంచి ఐదు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.
- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్సు లు వీక్షించే మోనిటర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో తహసల్దారు సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు తమ చాంబర్లలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్పీడీవోతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి తప్ప మిగిలిన అధికారులు హాజరుకాలేదు. అయితే, వారంతా కందుకూరులో హాజరైనట్లు ఎమ్పీడీవో తెలిపారు. ఎమ్పీడీవోకు 3, తహసీల్దారుకు 3 అర్జీలు అందాయి.
- ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు ప్రజావేదిక జరిగింది. మండల అధికారులు ఒక్కొక్కరిగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని 11.30 గంటలకే వెళ్లిపోయారు. తహసీల్దారు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ టీవీ సెట్ మరమతుకు గురికావడంతో ఎంపీడీవో కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌కు ఎంపీడీవో విజయతోపాటు తహసీల్దారు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ హాజరయ్యారు.
- వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : ఎమ్పీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావేదిక జరగలేదు. వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పనిచేయక పోవడంతో పలు శాఖల అధికారులు కందుకూరులోని తహసీల్దారు కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ అబ్దుల్ అమీద్ హైకోర్టు పనిమీద అమరావతి వెళ్లడంతో డిప్యూటీ తహసీల్దారు నాయబ్‌రసూల్ కందుకూరులో పాల్గొన్నారు.



లింగసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో మరమ్మతులకు గురైన మోనిటర్

కావలిలో ప్రజాస్పందనే లేదు!

కావలి, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలంలో 8 అర్జీలు మాత్రమే వచ్చాయి. ఆర్డీవో వంశీకృష్ణ తోపాటు వివిధ శాఖలకు చెందిన సుమారు 20 మంది అధికారులు ఇందులో పాల్గొన్నారు. డివిజన్‌లోని 10 మండలాలు ఉన్నా ప్రజల నుంచి స్పందన కరువయ్యింది. అధికార పార్టీ నేతలను కాదని అధికారులకు సమస్యలు చెప్పినా గత ప్రభుత్వం లోలా పరిష్కారం కావనే భావనలో ఇంకా ప్రజలు ఉన్నారు. ప్రజావేదికలో ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకాన్ని అధికారులు ప్రజలకు కల్పించాల్సి ఉంది.



అర్జీలపై స్పందించండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ కార్తీక్

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సోమవారం పరిష్కార వేదికకు 256 అర్జీలు వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్ రావు, జడ్పీ సీఈఓ విద్యారమ, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరుల పాల్గొన్నారు.



- వెంకటేశ్వరపురంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.
- 12వ డివిజన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు జేసీకి వినతిపత్రం సమర్పించారు. తమ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దొరతోపు ప్రాంతంలో పొర్లుకట్ట సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

బాధితులకు న్యాయం చేయండి : ఎస్పీ

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు త్వరగా న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశించారు. ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 85 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చి వారి సమస్యలు ఎస్పీకి విన్నవించుకున్నారు.

పెన్నా నదిలా సీజేఎఫ్ఎస్ భూములు!



ఇక్కడ కన్పించేది పెన్నా నదో.. చెరువో అనుకుంటే తప్పులో కాలేసినట్లే. ఇది కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలో పెన్నా తీరాన చాలా ఏళ్ల క్రితం గిరిజనులకు ప్రభుత్వం పంపిణీ చేసిన సీజేఎఫ్ఎస్ భూమి. ఈ భూమిలో కొంత కాలం గిరిజనులు వేరుశనగ, ఆకు కూరలు పండించారు. ఆ తరువాత అక్రమార్కుల కన్ను పడింది. నయానో భయానో గిరిజనులను లొంగదీసుకు న్నారు. ఈ భూమిలోని మట్టి, ఇసుకను ఎక్స్‌కవేటర్లతో పరిమితికి మించి ఇష్టానుసారంగా తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకున్నారు. దీంతో సీజేఎఫ్ఎస్ భూమి గుంతలమయ మైంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ భూమి చెరువుగా మారి పెన్నానదిని తలపి స్తోంది. దీంతో ఉన్న కాస్త భూమి కూడా ఇలా అయిపోయిందని హక్కుదారులైన పేద గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కోవూరు,(ఆంధ్రజ్యోతి)

వెంగమాంబ ఆదాయం రూ.21.79 లక్షలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాల అమ్మ వారి ఆలయంలో సోమవారం ఆలయ కార్యనిర్వహణాధికారి వెట్టి గుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. రూ. 21,79,632 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్రాంత స్టేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.





బాస్ వస్తున్నారు... బాగు చేయండి !

జిల్లా పోలీసుబాస్ (ఎస్పీ) జీ కృష్ణకాంత్ ఈనెలలో మనుబోలు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేయనున్నారు. ఆయన వచ్చేలోగా స్టేషన్‌ను బాగుచేసే పనిలో కానిస్టేబుళ్లు నిమగ్నమయ్యారు. రంగులతో సుందరంగా ఠాణాను తీర్చిదిద్దారు. రికార్డులను సిద్ధం చేశారు. ఠాణా పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

- మనుబోలు, (ఆంధ్రజ్యోతి)

నేర వార్తలు (crime news) ఆంధ్రజ్యోతి

నకిలీ అధికారులకు రిమాండ్

ఉలవపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మోటర్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ అని చెప్పి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సోమవారం కందుకూరు డీఎస్పీ వీబీ సుబ్రమణ్యం తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. నవంబరు 27వ తేదిన ఉలవపాడు జాతీయ రహదారి రాజుపాలెం సాయిబాబా మందిరం సమీపంలో నెల్లూరు హరీష్ రెడ్డి, షేక్ సిరాజ్, సయ్యద్ లతీఫ్‌లు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అవతారంలో వాహనాలకు ఆపి వారి నుంచి డబ్బు వసూలు చేశారు. ప్రకాశం జిల్లా పాత సింగరాయకొండ బాలకృష్ణ ఉలవపాడు మండలం సుబ్బరాయుడి సత్రం నుంచి మామిడి లోడ్‌తో వెలుతున్న వాహనాన్ని ఆపారు. తాము ఎంవీఐ అధికారులం.. వాహనానికి సంబంధించిన పత్రాలు చూపిం చాలని బెదరించి అతని నుంచి రూ.3వేలు ఫోన్ పే చేయించుకున్నారు. తీరా మోసపోయానని తెలిసి బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు ఎస్ఐ అంకమ్మ కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం 7గంటల సమయంలో కరేడు ర్యాంపు వద్ద హైవేపై సిరాజ్, లతీఫ్ ఇద్దరూ అదే తరహా దందా చేస్తుండగా అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. ప్రధాన నిందితుడు హరీష్ రెడ్డి పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ అంకమ్మ

తప్పిన ప్రమాదం



కావలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రంకురోడ్డు పోస్టాఫీస్ సమీపంలోని పూల దుకాణంకు చెందిన మిద్దె చేపట్టుగోడ సోమవారం ఉదయం కూలిపోయింది. ఆ సమయంలో ఈ ప్రాంతంలో పూలను విక్రయిస్తున్న వ్యక్తి లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. పూలు అమ్మే వ్యక్తి ఉంటే వాటిని కొనుగోలుకు వినియోగదారులు కూడా వచ్చి అక్కడ నిలబడి ఉండేవారు. ఆ సమయంలో గోడ పడి ఉంటే జరిగే ప్రమాదాన్ని తలచుకుంటేనే భయం వేస్తోందని వాపోయారు. మున్సిపల్ అధికారులు గతంలో కాలం చెల్లిన భవనాలకు నోటీస్‌లు ఇచ్చారేగానీ వాటి తొలగింపునకు చర్యలు చేపట్టలేదన్నారు.

యువతి ఆత్మాహత్యాయత్నం

ఇందుకూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన హారిక అనే యువతి ఆత్మహత్య చేసుకుందామని సోమవారం మైపాడు బీచ్‌కి వచ్చింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువు శ్రీలత 112 నెంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు హారిక ఫోన్ లోకేషన్ తెలుసుకుని ఆమెను బీచ్ పక్కనే ఉన్న శివాలయం వద్ద గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమె సోదరుడికి అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ఐ రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కింద పడి తలకు గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండిన యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. ఎన్టీవో కాలనీకి చెందిన కాలేషా(35) టైల్స్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుమారు 12 ఏళ్ల కిందట ఇందుకూరుపేట నుంచి నెల్లూరుకు బైక్‌పై వస్తుండగా డివైడర్‌ను ఢీకొని కిందపడి తలకు తీవ్ర గాయమై శస్త్రచికిత్స జరిగింది. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబకలహాల నేపథ్యంలో ఏడాది క్రితం భార్య తన పిల్లలను తీసుకొని గూడూరులోని తన పుట్టింటికి వెళ్లింది అప్పటి నుంచి తన తల్లి రహీమాతో కలసి ఉంటున్న కాలేషా ఈనెల 7వతేదీన ఇంటి బయట వాంతులు చేసుకొని ఇంట్లోకి వెళ్లే క్రమంలో కాలు జారి కిందపడి తలకు గాయమై చెవిలో నుంచి రక్తం వచ్చింది. గమనించిన తల్లి, కుటుంబ సభ్యులు ఆయనను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి తల్లి రహీమా సోమవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పత్తేఖాన్‌పేటకు చెందిన పెంచలమ్మ వంట పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. ఆమె కుమార్తె రాజేశ్వరి పుట్టుకతోనే మూగ. ఆ యువతి కూడా వంట పనిలో తల్లికి చేదోడు వాదోడుగా ఉండేది. ఈనెల 8వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఆ యువతి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కోసం తల్లి గాలించినా జాడ తెలియకపోవడంతో సోమవారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్న రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలి

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకున్న రైతులకు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని జిల్లా బీసీ సంఘం నాయకులు గుమ్మడి అంకయ్య, శివనాగేంద్ర, తదితరులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా విజ్ఞప్తుల దినంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ సదస్సుల్లో సమస్యలు పరిష్కరించడం అభినందనీయమని, అదే విధంగానే రైతులకు ఎలాంటి ఇబ్బందులేకుండా పాస్‌పుస్తకాలు అందజేయాలని కోరారు.

చీకటిలో తిక్కవరప్పాడు

వెంకటాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ పరిధిలోని గొట్ల పాళెం, మంగళంపాడు, తిక్కవరప్పాడు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నగానికి పైగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రిళ్లు ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే కష్టంగా ఉందని వారు వాపోయారు. ఈ విషయమై అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా, ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. అధికారుల తీరుపై వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	89
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	168
స్కిన్‌లెస్	188
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7379
వెండి కిలో ధర	రూ. 93,800
వెండి ఒక గ్రాము	రూ.96.80



గొట్లపాళెంలో వెలగని వీధి దీపం

తల్లీబిడ్డల ప్రాణాలకు భరోసా ఏదీ?

- కావలికి చెందిన రాజశేఖర్ భార్య దివ్య కావలి ఏరియా ఆసుపత్రిలో గత సెప్టెంబరు నెలలో బాబుకు జన్మనిచ్చింది. 44 రోజులకే ఆ చిన్నారి న్యూమోనియాతో అల్లాడుతుండటంతో అక్కడ ఏరియా ఆసుపత్రి వైద్యుల సూచనలతో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆ చిన్నారి మృత్యువాత పడ్డాడు.
- నెల్లూరు నగరం మూలాపేటకు చెందిన అన్న మాధవి(28) ప్రసవం అనంతరం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గత నెల 4వ తేదీన మృత్యువాత పడింది. అయితే ఆమె గుండె జబ్బుతో మృత్యువాత పడిందని వైద్యులు నిర్ధారించారు.
- వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రాజేష్ భార్య మమతకు పురిటినొప్పులు వచ్చి కాన్పు కష్టంగా మారడంతో అక్టోబరు 23వ తేదీన నెల్లూరు జీజీహెచ్‌కి తరలించగా వైద్యులు ప్రసవం చేశారు. అయితే ఆ చిన్నారికి తీవ్ర అనారోగ్యం కావడంతో జీజీహెచ్ చిన్నపిల్లల విభాగంలో చేర్పించి వైద్య చికిత్సలు అందించారు. అయితే చిన్నారి 25వ తేదీన మృతి చెందాడు.



జీజీహెచ్‌లో బాలింతల వార్డు

- ప్రసవ సమయంలోనే మృత్యువాత
- వైద్యుల నిర్లక్ష్యమా.. అవగాహన లోపామా?
- రాష్ట్రంలో 6వ స్థానంలో జిల్లా
- విచారణతో సరిపెడుతున్న అధికారులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒకటి రెండు కాదు ఏకంగా అక్టోబరు నెలలోనే 6 మంది చిన్నారులు, ఇద్దరు తల్లులు మృత్యువాత పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినా, నిష్ణాతులైన వైద్యనిపుణులు ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి ఏటా ప్రసవం అనంతరం తల్లులు, బిడ్డలు ఎందరో మృత్యువాత పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువ మంది వైద్యులు సమయపాలన పాటించకపోవటం, అత్యవసర పరిస్థితుల్లో



మృత్యువాత పడ్డ చిన్నారి (ఫైల్)

అందుబాటులో లేక పోవటంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు జిల్లా 'ప్రకాశం'లో తల్లీబిడ్డల మృతుల నివారణలో మొదటి స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతుండగా నెల్లూరు జిల్లా తల్లీ, బిడ్డల మృతువాతలో ఆరో స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే విషయం. మృతులపై ప్రతి నెల అధికారులు నిర్వహిస్తున్న సమీక్షలు నామమాత్రమేనని కొందరు వైద్యాధికారులే చెబుతుండటం కొస మెరుపు.

● కాలనీల్లో అవగాహన ఏదీ!?

ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు వారి పేర్లు నమోదు చేస్తున్నారు. అయితే ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలలో వారికి అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. అంతేగాక వారి ఆరోగ్య పరిస్థితులపై సరైన పర్యవేక్షణ లేక ఆలస్యంగా ఆసుపత్రికి వస్తుండడం వల్ల కూడా ఈ మరణాలు సంభవిస్తున్నట్లు తెలుస్తోంది. గర్భందాల్చినప్పటి నుంచి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకు వచ్చి వారికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించటంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

● ప్రభుత్వాల పర్యవేక్షణ ఉన్నా..

జిల్లావ్యాప్తంగా 52 ప్రభుత్వ ప్రాథమిక, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలతోపాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. ప్రతి ఏటా జిల్లాలో 40 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రభుత్వ ఆసుపతులలో 11 వేలకుపైగా ప్రసవాలు జరుగుతున్నాయి. గర్భిణుల ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. ఈ క్రమంలో ప్రతి నెల 9వ తేదీన ప్రధాన మంత్రి మాతృవందన కార్యక్రమం కింద గర్భిణులకు విధిగా పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలి. గ్రామాల్లో ప్రత్యేక విలేజ్ క్లినిక్‌ల ద్వారా ఆరోగ్యస్థితిని పర్యవేక్షించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో హైరిస్క్ గర్భిణుల కోసం ప్రత్యేక వైద్య చికిత్స అందించాలి. ఇంతపెద్ద నెట్‌వర్క్ ఉన్నా గర్భిణులు, శిశువుల మరణాలు చోటు చేసుకుంటున్నాయి. అయితే తల్లులు, శిశువుల మృతిపై అధికారులు పెదవి విరుస్తున్నారు.

తల్లీబిడ్డల మృతుల వివరాలు

సంవత్సరం	తల్లులు	శిశువులు
2022-23	25	239
2023-24	18	157
2024-25 (నవంబరు)	41	73

చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో

జిల్లాలో గత అక్టోబరు నెలలో సంభవించిన మాతా, శిశు మరణాలపై డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తన కార్యాలయంలో సబ్ కమిటీతో కలిసి వైద్యులు, సిబ్బందితో ఆయన సమీక్షించారు. ప్రతి గర్భిణీని గుర్తించి సంపూర్ణ ఆరోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. దీనికి ఆరోగ్య పర్యవేక్షకులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి గర్భిణి, బాలింతకు జేఎస్‌కే, జేఎఫ్ఎస్‌కే పథకాలు అందేలా చూడాలని తెలిపారు. సకాలంలో వైద్య చికిత్స అందక నిర్లక్ష్యం వల్ల తల్లీబిడ్డ మృతి చెందితే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో జీజీహెచ్ వైద్యులు స్వర్ణముఖి, భవాని, శోభారాణి, దయాకర్, చంద్రసేన్‌రెడ్డి, శ్రీధర్, డెమో కనకరత్నం, మంజుల, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరు ఎస్‌పీఎస్ అప్పర్ ప్రైమరీ ద్రవ్య సహాయక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ లాంగ్వేజ్ పండిట్ (తెలుగు)1, లాంగ్వేజ్ పండిట్(హిందీ)1 పోస్టులకు డైరెక్ట్ నియామకం చేపట్టేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు నేరుగా సంబంధిత పాఠశాల యాజమాన్యానికి, జిల్లా విద్యాశాఖ కార్యాలయంకు ఆన్‌లైన్ ద్వారా cse.ap.gov.in aided recruitment వెబ్‌సైట్‌కు ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలి

● ఇన్‌కంటాక్స్ అదనపు కమిషనర్ శ్రీధర్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించాలని ఇన్‌కంటాక్స్ అదనపు కమిషనర్ వి.శ్రీధర్ కోరారు. సోమవారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఆదాయపు పన్నుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో చెల్లించే మూడవ ఆదాయపు పన్ను వాయిదా గురించి వివరించారు. అడ్వాన్సు టాక్సు, వివాద్ విశ్వాస్ స్కీమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కంటాక్సు సహాయ కమిషనర్ కె.శరత్‌బాబు, ఇన్‌కంటాక్సు అధికారి సందీప్‌కృష్ణ, నెల్లూరులోని వ్యాపారులు, చార్టెడ్ అకౌంటెంట్లు, చాంబర్ ఆఫ్‌కామర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శ్రీధర్

15న ప్రమాణ స్వీకారం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



టీడీపీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15వ తేదీన నుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రకటించారు. మంత్రి పొంగూరు నారాయణ సహకారంతో పదవికి వన్నె తెచ్చేలా పని చేస్తానని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ ముఖ్య నేతలతో కోటంరెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై పోరాటంలో కార్యకర్తలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, నందమూరి బాలకృష్ణ ఆశీస్సులతో తనకు రెండోసారి నుడా చైర్మన్ పదవి దక్కినట్లు తెలిపారు. తనవెంట నడిచిన ప్రతి కార్యకర్తను గుర్తుంచుకొని తగిన గౌరవం ఇస్తానని హామీ ఇచ్చారు. తాను కష్టపడి పనిచేస్తున్నానని చంద్రబాబు, బాలకృష్ణ కొనియాడడం తన జీవితంలో మర్చిలేనిదన్నారు. నుడా పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. 15వ తేదీన ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రతి ఒక్కరూ హాజరై తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు - విజయవాడ

సింగిల్ స్టాప్ బస్సులు

● వెళ్లేప్పుడు గుంటూరు, వచ్చేప్పుడు కావలిలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నెల్లూరు నుంచి విజయవాడకు సింగిల్ స్టాప్ సూపర్ లగ్జరీ బస్సులు ఈనెల 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని నెల్లూరు 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులు విజయవాడకు వెళ్లేటప్పుడు గుంటూరులో, నెల్లూరుకు వచ్చేటప్పుడు కావలిలో మాత్రమే ఆగుతాయని పేర్కొన్నారు. దీంతో ఈ బస్సులు కేవలం 5 గంటల ప్రయాణంలో గమ్యస్థానాలకు చేరుతాయని తెలిపారు. నెల్లూరు నుంచి విజయవాడకు ఉదయం 8.30, మధ్యాహ్నం 2.30, రాత్రి 10.30 గంటలకు బయల్దేరుతాయని, విజయవా డ నుంచి నెల్లూరుకు వచ్చే బస్సులు ఉదయం 7.15, సాయంత్రం 4 గంటల కు బయలుదేరుతాయని తెలిపారు. ప్రయాణికులు ఈ సింగిల్ స్టాప్ బస్సుల ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, న్యాయాధికారి వాణి



మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

వెంకటాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చట్టాలపైన విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కొందరు విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసలై జీవి తాలను పాడు చెసుకుంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించడంతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్రొఫెసర్లు సుజా ఎస్ నాయర్, జీ మేరీ సందీప్, డాక్టర్ జీ విజయలక్ష్మి, డాక్టర్ పీ త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

జనమంతా ఉరుకులు, పరుగులు

● నెల రోజులుగా పనిచేయని ఆధార్ సెంటర్లు ● ఈకేవైసీ, అపార్ నమోదుకు అగచాట్లు
● అప్‌డేట్ లేకపోతే పథకాలు రావేమోనని అపోహ

సీతారామపురం, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్ కీలకంగా మారింది. అలాంటి ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి, సింగారెడ్డిపల్లి గ్రామ సచివాలయాలలో ఆధార్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అయితే, గత నెల 1వ తేదీ నుంచి ఆధార్ సేవలు పనిచేయకపోవడంతో జనమంతా ఉదయగిరి, పోరుమామిళ్ల, బద్వేల్, పామూరు వంటి ప్రాంతాలకు చంటి బిడ్డలను ఎత్తుకొని వెళుతున్నారు. వ్యయప్రయాసలతో అంత దూరం వెళ్లి అధిక మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నూతన రేషన్ కార్డులకు, కాలనీలకు ఆధార్ నెంబరు కీలకం కావడంతో వాటి నమోదు, నవీకరణ చాలా ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. అంతేగాక అపార్ ఐడీ కోసం విద్యార్థులు వారి పుట్టిన తేదీ, పేరులో మార్పులు, చేర్పుల కోసం పాఠశాలలకు సెలవు పెట్టి మరీ దూరప్రాంతాలకు వెళుతున్నారు. అయితే, అక్కడ రద్దీ ఉండటంతో చదువులకు ఆటంకం ఏర్పడుతోందని, త్వరితగతిన ఆధార్ సేవలను పునరుద్ధించాలని కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ సమస్య

ఈ వ్యవహారంపై గ్రామ సచివాలయ అధికారులను సంప్రదించగా యూఐడీఏఐకి సంబంధించిన సాఫ్ట్‌వేర్ సమస్య వల్ల మండలం మొత్తం ఆధార్ సేవల్లో అంతరాయం ఏర్పడిందని, త్వరలోనే సేవలను పునఃప్రారంభిస్తామని పేర్కొన్నారు.



సింగారెడ్డిపల్లి సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో ప్రజలు (ఫైల్)

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి : సీపీఐ



కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు సోమవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మాలకొండయ్య మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలను వెంటనే బహిర్గతం చేయాలని, ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ అవినీతిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైనందున కేంద్రం ఆయన్ను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సబ్ కలెక్టరు కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూసి సురేష్ బాబు, షేక్ హుస్సేన్, మురళీ, ఉప్పుటూరి మాధవరావు, ఎండ్లూరి వీరాంజనేయ కుమార్, జడ సునీల్, నత్తా రామారావు, కోటేశ్వరరావు, సీతారామయ్య, సుభాన్, దుర్గాప్రసాద్, ఆనంద్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి : లోక్‌సత్తా

కావలిటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని లోక్‌సత్తా ఉద్యమ నాయకులు మాలకొండారెడ్డి తెలిపారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవంను పురస్కరించుకుని సోమవారం పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అవినీతి వ్యతిరేక చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో పౌరులందరూ విధిగా అవినీతి వ్యతిరేక చట్టాల పట్ల అవగాహన కలిగివుండాలని అప్పుడే అవినీతిని ప్రశ్నించగలం అన్నారు. అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ.సుబ్బారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వేణుగోపాల్ సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది నమోదైన కేసులు, పరిష్కారమైన కేసుల వివరాలను, సిబ్బంది సమస్యలను అగిగి తెలుసుకున్నారు. అనంతరం నేరాల ని యంత్రణకు పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాలకు లోను కాకుండా జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు జిలాని, సాయి ప్రసాద్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గానుగపెంటలో రెవెన్యూ సదస్సు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, తదితరులు

కొండాపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గానుగ పెంటలో సోమవారం నిర్వ హించిన గ్రామ రెవెన్యూ స దస్సుకు భూ సమస్యలపై 8 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఎమ్. కోటేశ్వరరావు తెలిపారు. వెబ్‌ల్యాం డ్‌లో భూ వివరాలు నమో దుకు 4, అసైన్డ్‌మెంటు భూ ఆక్రమణపై 3, వినతులు, పట్టాదారు పాసుపుస్తకం ఉ న్న ఆన్‌లైన్లో పేరు లేదని ఒక వినతి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వీఆర్ కొండయ్య, సర్పంచ మల్లికార్జున, ప్రజాప్రతినిధులు నర్రావుల వెంకటేశ్వర్లు, కిలారి నరేంద్ర, సర్వే యర్ల బృందం, అధికారులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాల్లో మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నగారిపాలెం పంచాయతీ ఒట్టూరులోని బెల్టు దుకాణంపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం అమ్మకాలు చేపడుతున్న అప్పనగిరి పొట్టియ్యను అదుపులోకి తీసుకుని 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ దేవిక సిబ్బంది ఉన్నారు.

బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలుకుదాం



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్‌బాబు

కావలి టౌన్, డిసెంబరు 9: బట్టీ పట్టే విధానానికి ఇకనుంచి స్వస్తి పలుకుదామని సైక్రియాటిస్ట్ సురేష్ బాబు తెలిపారు. సోమవారం గొల్ల మూడివీధిలోని నలందా హైస్కూల్ లో ఈ అంశంపై అవగాహన కల్పించారు. మేధాశక్తి ఏ విధంగా పెంచుకోవాలి, చదువులలో ఎలా రాణించాలి అన్న అంశంపై మట్లాడారు. సెల్ ఫోన్‌తో చదువులపై పడే దుష్ప్రభావంపై అవగాహన కలిగి వుండాలన్నారు. తల్లితండ్రులతో చర్చా వేదిక నిర్వహించి వారి సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో నలండా డైరెక్టర్ ఎండీ వశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు నడిపితే కేసులు నమోదు



డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు

ఆత్మకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ తగిలించి రహదారులపై నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని ఆత్మకూరు బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు. సోమవారం ఆయన ఆత్మకూరు రహదారిపై కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను నిలిపి రైతును హెచ్చరించారు. ఇనుప చక్రాల వల్ల రహదారులు దెబ్బతింటున్నాయని, రోడ్డు నిబంధనల మేరకు ఇది నేరమని, రహదారులకు నష్టం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాడు ఘనం... నేడు అధ్వానం

- శిథిలమైన భవనం... ఉరుస్తున్న గదులు
- దుస్థితిలో కొరిమెర్ల ప్రభుత్వ హైస్కూల్



శిథిలస్థితిలో పాఠశాల భవనం



వర్షానికి ఉరుస్తున్న గదులు

సంగం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒకనాడు తరగతుల నిండుగా విద్యార్థులతో ఎంతో వైభవం సంతరించుకున్న మండలంలోని కొరిమెర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నేడు వసతులు కరువై విద్యార్థుల్లేక వెలవెల పోతూ దైన్య స్థితిలో ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది తగ్గిపోయింది. సుమారు ఏడు దశాబ్దాల కిందట 1956లో సుమారు 5 ఎకరాల సువిశాల స్థలంలో దీన్ని స్థాపించారు. నాడు తరగతికి ఒక గది, హెచ్‌ఎం, క్రాఫ్ట్, లైబ్రరీ, ల్యాబ్ వంటి వసతులతో భవనం, విశాలమైన ఆటస్థలం ఉండేవి. ఈ పాఠశాల అనుబంధంగా బీసీ బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలు ఉండేవి. నాడు 6 నుండి 10 తరగతుల వరకు సుమారు 500 మంది విద్యార్థులతో పాఠశాల కళకళలాడేది. నేడు పాఠశాల శిథిలస్థితికి చేరడంతో విద్యార్థుల సంఖ్య 142 మంది పడిపోయింది. అప్పట్లో నిర్మించిన ప్రహరీ దెబ్బతినడంతో గత టీడీపీ ప్రభుత్వంలో రూ. 30 లక్షలకు పైగా వెచ్చించి విశాలమైన ఆటస్థలం చుట్టూ ప్రహరీ నిర్మించారు. కానీ నూతన తరగతి గదులు నిర్మించలేదు. చాలా గదులున్నా అన్నీ శిథిల స్థితికి చేరి ఉరుస్తున్నాయి. వానొస్తే విద్యార్థులు కూర్చొనేందుకు స్థలం లేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్యలపై అర్జీల వెల్లువ

- రీసర్వేలో తప్పులు సరిదిద్దాలని సబ్ కలెక్టరుకు బాధితుల మొర



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో భూ సమస్యలపైనే డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వచ్చి సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజకు అర్జీలు అంద జేశారు. ప్రధానంగా ఆన్‌లైన్ పొరపాట్లుని సరిచేయించాలని, రీసర్వేలో తప్పులను సరిదిద్దాలని అధిక సంఖ్యలో ఫిర్యాదు చేశారు. మ్యూటేషన్ సమస్యలపైనా పలువురు అర్జీలు అందజేశారు. రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మాకు చేస్తున్న అన్యాయాన్ని నివారించాలని గుడ్లూరు మండలం రావూరువాసులు సబ్ కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన జీ. సుబ్బరామయ్య నేతృత్వంలో పలువురు రైతులు 2013 భూసేకరణ చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న బలవంతపు భూసేకరణను అడ్డుకుని తమకు న్యాయం చేయాలని విన్నవించారు. వ్యవసాయం జీవనాధారంగా బతికే మా భూములను పరిశ్రమల పేరుతో తీసుకుంటే ఎలాగో ఆలోచన చేయాలని విన్నవించారు. అలాగే భూసేకరణ చట్టాన్ని అనుసరించి పరిహారం ఇవ్వటం లేదన్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు. అలాగే కందుకూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల వేదికలో పారిశుద్యం, ఇళ్లమధ్య మురుగునీరు, రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి తదితర సమస్యలపై కమిషనర్ అనూషకు 10అర్జీలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



కావలి: ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఆత్మకూరు: మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కావలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఆందోళన చేపడతామని మున్సిపల్ కార్మికులు తెలిపారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో వారు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని రాజగోపాల్ మాట్లాడారు. ఔట్ సోర్సింగ్, డైలీవేజ్, చనిపోయిన, వయసు రీత్యా తొలగించిన కార్మికుల కుటుంబసభ్యులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్ హెల్త్ అరియర్స్, పెండింగ్ సరెండర్ లీవ్‌లు, ఎన్‌క్యాష్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కే.నాగరాజు, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు, చేవూరు కొండయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, గుంజి క్రిషోర్, ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, ఉఎండ్లూరి రవి, వెంకటేశ్వర్లు, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

●ఆత్మకూరు : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. పాత పంచాయతీ కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ఏఐటీయూసి జెండాలు పట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇంజనీరింగ్ విభాగ కార్మికులు, ఆఫీస్ సిబ్బంది వేతనాలు పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, హజరత్తయ్య, మున్వీర్ బాష, కృష్ణయ్య, నాగేంద్ర, వాసు, జానీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యంగిరా వారాహిదేవి హోమాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునునూరు హనుమక్షేత్రంలో సోమవారం ప్రత్యంగిరా వారాహిదేవి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా కేరళ తంత్రం శ్రీకృత్య కృతంగిరా తాంత్రిక పీఠం గురువర్యులు శ్రీకొమండూరి శేషాచార్యులు మాట్లాడారు. కావలిలో వచ్చే ఏడాది నాటికి ప్రత్యంగిరా వారాహిదేవి ఆలయాన్ని నిర్మింపజేస్తామన్నారు. మంగళవారం ఉదయం పంచామృతాభిషేకం, అనంతరం భద్రకాళీ హోమాలు, రుద్ర ప్రత్యంగిరా హోమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్‌క్షేత్ర వ్యవ స్థాపకులు వేదగిరి సూర్యనారాయణ చార్యులు, నిర్వహకులు ఇంటూరి రమణయ్య, పొట్టేపాలెం సుధీర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కావలి రూరల్: పల్నాడు జిల్లా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కావలి పట్టణంలోని వైకుంఠపురం తాతా తిరుపతి, సిరిపురం ఉప్పాల ఏబులు, తుళ్లూరు సురేష్ వనిత దంపతుల పార్థివ దేహాలకు సోమవారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి నివాళులర్పించి కుటుంబసభ్యులతో పరామర్శించారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన సురేష్ పిల్లలు సురుచి, మహేష్‌లకు అవసరాల నిమిత్తం ఎమ్మెల్యే రూ. 50వేలు అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు నాయుడు రాంప్రసాద్ మృతులకు టీడీపీ సభ్యత్వం ఉందని పార్టీ నుండి ప్రమాదబీమా, ప్రభుత్వ ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నేతలు గంటా మల్లికార్జున్, చాగంటి వెంకటే శ్వర్లు, గుర్రం సునీల్ ఉన్నారు.

రైతుసేవా కేంద్రం భవనానికి అవినీతి పగుళ్లు

- బయటపడిన నాణ్యతలో డొల్లతనం



భవనానికి పగుళ్లు ఇచ్చి లోపలికి చేరుతున్న వర్షపు నీరు

వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూనిపాలెం రైతు సేవా కేంద్రం భవనం నిర్మించిన ఏడాదికే గోడలకు పగుళ్లు వచ్చాయి. గత ప్రభుత్వ హయంలో రూ.21.75 లక్షలతో ఈ కేంద్రంను నిర్మాంచారు. నిర్మాణ పనుల్లో సిమెంటు తగ్గించి ఇసుక ఎక్కువ మోతాదులో వేయడం, దానికి తోడు పూర్తిస్థాయిలో వాటర్ క్యూరింగ్ చేయకపోవడం తదితర కారణాలతో ఈ సమస్య నెలకొందన్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ పగుళ్ల నుంచి వర్షపు నీరు భవనంలోకి వస్తుందని సచివాలయ ఉద్యోగులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే గోడలు త్వరగా దెబ్బతిని కూలిపోయే అవకాశం ఉందన్నారు. వైసీపీ నాయకులు ఇచ్చిన ఆమ్యామ్యాయాలకు పంచాయతీ ఇంజనీరింగ్ పర్యవేక్షణాధికారులు ఇలా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సిన భవనం మూణాళ్ల ముచ్చటగా మారింది. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది.

ఆర్వో ప్లాంట్‌కు మోక్షమెప్పుడో..?



వలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి) : చుండి మోడల్‌స్కూల్‌లోని ఆర్వో ప్లాంటు రెండు నెలల నుంచి పని చేయక పోవడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదు. ఈ ప్లాంట్ తరచుగా మరమ్మతులకు గురి అవుతుండటంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఏం చేయాలో తెలియక చేతులెత్తేసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

కాస్త చూసుకుని వెళ్లండి !



ప్రమాదకరంగా ఉన్న అల్లూరు-కావలి రోడ్డు

గోగులపల్లి, కావలి రోడ్డులోని మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో అనేకసార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సూచిక బోర్డు, స్పీడ్‌బ్రేకర్‌లు ఏర్పాటు చేయలేదు. దీనికితోడు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న చిల్లచెట్లు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. మూడేళ్ల నుంచి అధికారులు వీటిని తొలగించే చర్యలు తీసుకోలేదు. వాహనదారులూ.. ఈప్రాంతంలో వేగంగా వెళ్లకుండా కాస్త చూస్కొని వెళ్లండి. - అల్లూరు (ఆంధ్రజ్యోతి)

నిర్ణీత వ్యవధిలో రైతుల సమస్యలు పరిష్కారం

- ఇన్‌చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్



మర్రిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చలానా కట్టిన 23 రోజుల వ్యవధిలో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, కొన్ని సమస్యలకు చలానాలు కట్టుకునేందుకు వీలులేకుండా ప్రభుత్వం తాత్కాలికంగా కంప్యూటర్‌లో లాక్ చేసిందని ఇన్‌చార్జి తహసీల్దారు అనీల్‌కుమార్ తెలిపారు.

ఎంతెంత?

? అసైన్మెంట్ పట్టా దారుడి మరణానంతరం వారసులు భూమిని మార్పు కునేందుకు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమేనా.

! అడంగల్‌లో భూమి స్వభావం.. ప్రభుత్వం మెట్ట లేదా ప్రభుత్వం అనాధీనం అని ఉంటే చలానా కట్టుకునేందుకు వీలులేదు. గత 3 సంవత్సరాల నుంచి ప్రభుత్వం నిలిపివేసింది.

? నోషనల్ ఖాతాల రైతులు తమ ఖాతాలను ఒరిజినల్‌గా మార్చుకోవాలంటే ఏమి చేయాలి.

! రైతు తమ వద్ద ఉన్న ఆధారాలతో ఇచ్చిన అర్జీకి రిపోర్టు రాసి జాయింట్ కలెక్టరుకు సిఫారసు చేస్తాము.

? ఎక్కువమంది రైతులు ఏ విధమైన సమస్యలపై తరచూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

! నోషనల్ ఖాతాల రైతులు, 6వ విడత భూ పంపిణీలో పట్టాలు పొందామంటూ.. వాటిని కంప్యూటర్ అడంగల్‌లో ఎక్కించాలని తిరుగుతున్నారు.

న్యూస్ బాక్స్

సచివాలయం తనిఖీ

పలేటివారిపాలెం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోకూరు సచివాలయంను సోమవారం ఎంపీడీఓ నరేంద్రదేవ్ తనిఖీ చేశారు. సచివాలయంలో మూమెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సమయంలో డిజిటల్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. మిగిలిన ఉద్యోగులు సెలవులో ఉన్నట్లు తెలిపారు. సమయపాలన పాటించాలని ఎంపీడీఓ సూచించారు.

అధికారులు, సర్పంచులకు శిక్షణ

కలిగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మంగళ, బుధవారం స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. 170 మంది ప్రజాప్రతినిధులు, సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి, ఎంపీడీఏఓ కార్యాలయం, ఆర్‌బీకే బిల్డింగ్ గ్రామ సచివాలయం-2లో నిర్వహించే శిక్షణకు సంబంధిత అధికారులు, ప్రజాఅప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఇనాం భూముల రిజిస్ట్రేషన్‌పై వివాదం

బిట్రగుంట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా తాము సాగు చేసుకుంటున్న ఇనాం భూములు రికార్డుల్లోకి ఎక్కలేదని, వాటిని ఏ విధంగా రిజిస్టేషన్ చేసుకున్నారని గ్రామస్తులు డిమాండ్ చేశారు. బోగోలు పంచాయతీ అక్కరాజువారి కండ్రికలో సోమవారం పుల్లయ్య అనే వ్యక్తి ఇనాం భూమిని దున్నుతుండగా అక్కరాజువారి కండ్రిక, చెంచులక్ష్మీపురానికి చెందిన కొందరు వచ్చి అడ్డుకున్నారు. పొలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రెవెన్యూ అధికారుల వద్దకు రావాలని మండిపడ్డారు. అలాగే 2007, 2017, 2023లో కొందరు వచ్చారని వారు నిలదీయడంతో పుల్లయ్య అక్కడి నుంచి వెనుదిరిగాడు.

రేపటి నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 పరీక్షలు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు సెల్ఫ్ అసెస్‌మెంట్ టర్మ్-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాలను విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తుందని, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రశ్నాపత్రాల కోసం నగదు చెల్లించి ఉంటే వారికి కూడా సరఫరా చేస్తామన్నారు. నగదు చెల్లించని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రశ్నాపత్రాలు తయారుచేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కరేడు విద్యార్థినులు

ఉలవపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటలకు కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు కుమారి నిరీష, వాయల రోహిణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పోన్నూరు శ్రీనివాసులు తెలిపారు. ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరుగుతున్న 71వ రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ టోర్నీలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరిని పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోటంగారి బాలేశ్వరరావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ కాటా బత్తిన కృష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

16 నుంచి ధనుర్మాసం వేడుకలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాగుంట లేఅవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి 2025 జనవరి 13 వరకు ధనుర్మాసం వేడుకలు వైభవంగా జరుగుతాయని ఆలయం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిరోజు విష్ణుసహస్ర నామార్చన, గోదాదేవి, అష్టోత్తర శతనామార్చన, తిరుప్పావై పారాయణాలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం ఆండాళ్ తాయారులకు తిరుప్పావై పారాయణం, ఆలయ ప్రదక్షిణోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ ధనుర్మాసంలో ప్రతిరోజు సాయంత్రం తిరుప్పావై ప్రవచనం కిడాంబి భక్తవత్సలస్వామి చేస్తారని, భక్తులు తరలిరావాలని కోరారు.

చిన్న 'బేజారు'!


గంటల తరబడి ఇవి ఇక్కడే!


సగం రోడ్డును ఆక్రమించేసి, ఆపై పార్కింగ్


రోడ్డుకు ఇరువైపులా దుకాణదారులు ఏర్పాటు చేసిన సామగ్రి, ట్రాఫిక్‌తో ఆగిన వాహనాలు

నరకంగా మారిన నగరవాసులకు చిన్నబజారు అంటే బెంబేలెత్తిపోతున్నారు. అసలే ఇరుకురోడ్లకు ఇరువైపులా వాహనదారులు ఇష్టానుజారం సామగ్రి ఉంచడం, ఆపై అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్ చేస్తున్నారు. ఆ రోడ్డు వెంబ డి కారు వెళ్లినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో చిన్నబజార్ ఉన్నా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడంలో మాత్ర అ ధికారులు విఫలమవుతున్నారు. కనీసం రోడ్డు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటే వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

కాలువ గట్టే గిరిజనుల ఆవాసం

● నరుకూరులో పక్కాఇళ్లకు నోచుకోని దుస్థితి


కాలువ గట్టుపై నివసిస్తున్న గిరిజన కుటుంబాలు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు పంచాయతీ పరిధిలో ఉన్న గిరిజనులు కాలువ కట్టపై దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. సుమారు 80 కుటుంబాలవారు కాలువ గట్టుపై నివసిస్తున్నారు. దాదాపు 50 ఏళ్లుగా వారు గుడిసెల్లోనే నివాసం ఉంటున్నారు. వెలగని వీధి దీపాలు, అందరికీ తాగునీటిని అందించలేని చేతిపంపు, కనుచూపు మేర కనిపించని మౌలిక సదుపాయాలు వారిని వెంటాడుతున్నాయి. అంతేకాక చిన్నారులు ఆటలాడుకునే క్రమంలో కాలవలో పడి మృత్యువాత పడుతున్నారు. గ్రామానికి కాస్త దూరంగా గిరిజన కుటుంబాలు ఉండడంతో వారి బాగోగులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇళ్ల స్థలా లు ఇచ్చి పక్కా ఇళ్లు కట్టించమని గత వైసీపీ పాలకులకు విన్నవించుకుంటే.. తూతూమంత్రంగా బేస్ మట్టం లెవల్‌కే కట్టి వదిలేశారని గిరిజనులు వాపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా సమస్యలు తీర్చాలని వారు కోరుతున్నారు.

ఇంకా మత్తు వీడని అధికారులు : జనసేన నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): అలసత్వానికి అలవాటుపడిన అధికారులు ఇంకా ఆ మత్తులో ఉన్నారని జనసేన జిల్లా నాయకుడు గునుకుల కిషోర్ అన్నారు. బుచ్చి నగర పంచాయతీ వవ్వేరులో ఆగ్రామ జనసేన నాయకుడు మురళి పొలాన్ని కొందరు ఆక్రమిస్తే, అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరక్కపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో సోమవారం జనసేన నాయకులు కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు గ్రామానికి వెళ్లి మురళిని పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ దురాక్రమణదారులకు ఆరునెలలు జైలుశిక్ష విధించేలా తక్షణ చర్యలు చేపడతామని, ఓ వైపు మంత్రి నారాయణ చెప్తున్నా వారు లెక్కచేయడం లేదన్నారు. మురళికి జరిగిన అన్యాయానికి అధికారులు న్యాయం చేసి ఇది మంచి ప్రభుత్వం అని నిరూపిస్తామన్నారు. అనంతరం వారు బుచ్చి తహసీల్దారుకు ఫోన్ చేసి బాధితుడికి తగినవిధంగా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమీర్, ప్రశాంత్‌గౌడ్, సాయి, షారు, మెహబూబ్, తదితరులు పాల్గొన్నారు.


వవ్వేరులో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి : జనసేన

మనుబోలు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మడమనూరు ప్రాథమిక పాఠశాల ఆక్రమణలకు గురైందని, దానిపై చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బీ సురేష్‌నాయుడు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన మండల జనసైనికులతో ఆందోళన చేశారు. అనంతరం మాట్లాడుతూ మడమనూరు ప్రాథమిక పాఠశాల స్థలమంతా ఆక్రమణలకు గురైందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు పీ ప్రసాద్, నాయకులు జీ వాణి భవానీనాయుడు, జాకీర్, ఆనంద్, కంటే శ్రీలక్ష్మి, కంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంకు ఖాతాదారులు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త!

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త ఉండాలని మహ మ్మదాపురం క్లస్టర్ సీసీ చిట్టేటి ఇందిరమ్మ తెలిపారు. సోమవారం వరదాపురంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, సైబర్ నేరాలపై ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ షేక్ అహ్మద్ తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్బీఐ సౌజన్యంతో ట్రీస్ సంస్థ వారు బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఈ సందర్భం గా ప్రదర్శించిన గోడపత్రికలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ రిసోర్స్ పర్సన్స్ ఏ చంద్రశేఖర్, కే వెంకటేశ్వర్లు, సంఘ బంధం అధ్యక్షురాలు మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల సేవలు అందించి బదిలీపై విడవలూరుకు వెళ్లిన లక్ష్మీప్రియని సోమ వారం ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో హెచ్‌ఎం బీ పద్మజ, స్టాఫ్ సెక్రటరీ చలపతిరావు పాల్గొన్నారు.

ఆవాజ్ మండల నేత మృతి


ఖాదర్‌బాష (ఫైల్)

కోవూరు, డిసెంబరు 9: మైనార్టీల హక్కుల కోసం పోరాడిన మండల ఆవాజ్ కమిటీ నాయకుడు షేక్ ఖాదర్‌బాష సోమవారం మృతి చెందారు. స్థానిక సత్రంవీధికి చెందిన ఆయన సీపీఎం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఖాదర్‌బాష మృతికి ఆవాజ్ జిల్లా కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. పలువురు సీపీఎం, ఆవాజ్ కమిటీ నాయకులు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళుల ర్పించారు.

డైస్‌కు వాహనం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో నిర్వహిస్తున్న డైస్ కేంద్రానికి రోగుల తరలింపునకు వాహనం ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులను తరలించేందుకు 10 నుంచి 16 సీట్లు ఉన్న వాహనం అవసరమని పేర్కొన్నారు. ఈ వాహనానికి నెలకు రూ.60వేల చెల్లి స్తామని పేర్కొన్నారు. వివరాలకు డైస్ మేనేజర్ 8466959902ను సంప్రదించాలన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీలకు ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్‌లో డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే సీనియర్ రికర్వ్ ఆర్చరీ పోటీలకు నెల్లూరుకు చెందిన చాట్ల అక్షయ్ మహదేవ్ ఎంపికయ్యారు. దీంతో నగరంలోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో సోమవారం క్రీడాకారుడిని అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చాట్ల నరసింహా రావు, డైరెక్టర్ రాజేష్, కోచ్ దివ్యప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వెంకటాచలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలు పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నదని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సర్వేపల్లిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ భూ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకువస్తే చట్టప్రకారం పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ విజయ్, వీఆర్‌వో వల్లెపు మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలకు దారి చూపండి

బుచ్చిరెడ్డిపాళెం,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నలభైఏళ్లుగా రెండు దళితవాడలకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితంలేదని దామరమడుగు దళితులు పేర్కొన్నారు. సోమవారం బుచ్చి తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో తహసీల్దారును కలిసి వారు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ దళితవాడలతోపాటు గిరిజనకాలనీలో మొత్తం వేయి కుటుంబాలున్నా, ప్రాణాపాయ పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా రాలేకపోతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి, సర్వే చేయించి రోడ్డు వెడల్పు చేయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్, చంద్ర, క్రిష్ణమోహన్, చిన్నబాబు పాల్గొన్నారు.

పెరటితోటల పెంపకంపై శిక్షణ

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూడిలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా పెరటి తోటల పెంపకంపై సోమవారం మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ జీఎల్.శివజ్యోతి మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులతో కూరగాయలు పెంచుకుని, సమతుల ఆహారం తీసుకుని ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం మహిళలకు కోడి పిల్లలను పంపిణీ చేశారు. వరి సాగు రైతులకు జీవన ఎరువులు అందజేశారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఏ.రాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి కే జ్యోత్స్నరాణి, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్.సుజాత, కిరణ్‌కుమార్‌రెడ్డి, వీపీఏ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


కోడిపిల్లలను పంపిణీ చేస్తున్న ఏడీ రాజ్‌కుమార్

అనుమతి లేని భవనాలు కూల్చేయండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సిటీప్లానింగ్ అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలను గుర్తించి కూల్చేయాలని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నగరంలోని బాలాజీనగర్, మూలపేట, వాకర్స్ రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించారు. వాటికి సంబంధించి ప్లాన్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగితే ఉపేక్షించేది లేదని, వాటిని వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. అనంతరం బట్వాడీపాళెం కూడలిలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను పరిశీలించి వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పలు ప్రాంతాలలో మురుగు కాలువలను పరిశీలించారు.

● ఈ మట్టిలో మొక్కలొస్తాయా!?

ఇలాంటి మట్టిలో మొక్కలు వస్తాయా? ఎక్కడైనా మొక్కల పెంపకానికి ఈ మట్టి వాడతారా? ఇదేనా మీ పర్యవేక్షణ? అంటూ ఎన్‌ఎంసీ ఉద్యాన అధికారి ప్రదీప్‌పై కమిషనర్ సూర్యతేజ మండిపడ్డారు. పొదలకూరురోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్లపై మొక్కలు పెంచేందుకు తోలిన మట్టిని ఆయన పరిశీలించారు. అందులో గడ్డి, కంకరతో కూడిన మట్టిరాళ్లు, గ్రావెల్ తరహా మట్టి ఉండటాన్ని చూసి అవాక్కయ్యారు. నూతన రోడ్డు నిర్మాణాలకు ఇరువైపుల వాడాల్సిన మట్టిని మొక్కల పెంపకం కోసం తీసుకురావడాన్ని తప్పుపట్టారు. ఈ మట్టిలో మొక్కలు ఎలా వస్తాయని నిలదీశారు. నగరంలో పచ్చదనం పెంపొందించడం కోసం భారీగా నిధులు ఖర్చు చేసి మొక్కలు ఏర్పాటు చేసే ప్రక్రియ జరుగుతుంటే ఇలాంటి మట్టిన వాడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.


నాశిరకం మట్టిని పరిశీలిస్తున్న కమిషనర్

రూ. 2 కోట్లతో రోడ్ల మరమ్మతులు

● 15 రోజుల్లో పూర్తి చేయాలి : ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ నియోజకవర్గంలో పాడైన రోడ్లకు రూ.2 కోట్లతో మరమ్మతులు చేపట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం నగరంలోని తన కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలోని అటు గ్రామీణ ప్రాంతాలు, ఇటు మున్సిపల్ డివిజన్లలో రోడ్లు వర్షాలకు దెబ్బతిన్నాయని తెలిపారు. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇందుకు అవసరమైన నిధుల కోసం ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు పొందినట్లు తెలిపారు. ఈ నిధులతో రాజరాజేశ్వరి ఆలయం, కరెంటాఫీసు కూడలి, హరనాథపురం, అపోలో కూడలి, డైకస్‌రోడ్డు, కృష్ణపట్నం రోడ్డు, రూరల్లోని ఆమంచర్ల, పొదకూరురోడ్డు తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు కమలాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న రూరల్ ఎమ్మెల్యే

'రాష్ట్రీయ బాల స్వాస్థ్య'తో జీవన ప్రమాణాల మెరుగు


విద్యార్థుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): పిల్లల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య అన్నారు. సోమవారం స్థానిక కోల్‌కెటేడ్ పీహెచ్‌సీ పరిధిలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్క్రీనింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, అభివృద్ధి ఆలస్యం, తదితర 32 సాధారణ ఆరోగ్య పరిస్థితులను ముందుగానే గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణులు డాక్టర్ కిరణ్, రిషిత, డాక్టర్ శ్రీకావ్య, ఆశా కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలోకి వైసీపీ నేత పెమ్మారెడ్డి

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపూడికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు పెమ్మారెడ్డి శ్రీనివా సులురెడ్డి టీడీపీలోకి చేరారు. సర్వేపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయనకు పచ్చ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యను ప్రోత్సహించాలి : ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తున్న ఉచ్చి భువనేశ్వర ప్రసాద్ తదితరులు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వేద విద్యను విస్తృతంగా ప్రోత్సహించాలని సింహపురి ధార్మిక సంస్థ వ్యవస్థాపకుడు, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని బాలాజీ నగర్ జరిగిన విశ్వనాథ స్మార్త వేద పాఠశాల 9వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విశ్వనాథ శ్రౌతుల 104వ జయంతోత్సవం నిర్వహించారు. అలాగే వేద విద్య పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు బండాత్మకూరు భానుప్రకాష్ శర్మ, ఘనాపాటి వేదపండితులు బండాత్మకూరు వెంకటసత్యవరకుమార్‌శర్మ, పోలేపెద్ది వివేక్ శర్మ, పూర్వ విద్యార్థి పూజిత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

ముత్తుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) :గత వైసీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి తుంగా ఏడుకొండలు డిమాండ్ చేశారు. పార్టీ నేతలతో కలసి సోమవారం ఆయన డీటీ ప్రదీప్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విదేశాల్లో రూ.వేల కోట్ల అక్రమాలకు, అవినీతికి అదానీ కంపెనీ పాల్పడ్డట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటి ఫలితంగా భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలు రూ.లక్షల కోట్లలో విద్యుత్ చార్జీలను భరించాల్సి ఉంటుందన్నారు. వెంటనే ఈ ఒప్పందాలను రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సీపీఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చేపల గుంతలకు వేలం



విడవలూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని మూలపుగుంట, స్నానాల గుంతల్లో చేపల పెంపకానికి, పట్టుకునేందుకు సోమవారం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రాధమ్మ వేలం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలంలో ఐదుగురు పాల్గొనగా, ఈదూరు మల్లి రూ.51వేలకు పాట పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బీ సుప్రజ, ఎంపీటీసీ భక్తవత్సలం, మాజీ సర్పంచు బీ శ్రీధర్, గ్రామపెద్దలు కొగొల్లు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్వామి అయ్యప్ప ఆలయంలో మండల పూజలు సోమవారం 24వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా పాలభిషేకం, గణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలిశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, మహాదీపారాధన, భాగవతిసేవ, అత్తాళంపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర హారతులు, హరిహరవాసనం జరిగాయి. ఈ కార్యక్రమాన్ని ఉభయదాతలు, ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.

నేటి నుంచి ఎల్ఎస్‌డీజీపై శిక్షణ

పొదలకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో స్థానికీకరణ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీ)పై శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డీ.నరసింహారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు.

● నేడు ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



హ్యూమన్ రైట్స్ రుబాబు




హ్యూమన్ రైట్స్ నేషనల్ వైస్ చైర్మన్ హోదా బోర్డుతో తిరుపతిలో తిరుగుతున్న కార్లు

● జిల్లాలో నకిలీ సంఘాల జోరు
● ఈ బోర్డులతో తిరుగుతున్న కార్లు

పోలీసులు సైతం భయపడేది ఒక్క 'హ్యూమన్ రైట్స్' అనే పదానికి మాత్రమే. భారత రాజ్యాంగంలో మహనీయుడు అంబేడ్కర్ పొందుపరచిన మానవ హక్కులు ఫలితం అది. మానవహక్కుల ఉల్లంఘనను చట్టం తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ ప్రాధాన్యాన్ని అడ్డం పెట్టుకుని జిల్లాలో హ్యూమన్ రైట్స్ సంఘాల పేరుతో నకిలీల దబాయింపు పెరిగింది. వివాదాల్లో జోక్యం చేసుకోవడం, పంచాయతీలు చేయడం వీరికి ఉపాధిగా మారింది. పిటిషన్లు పెట్టి బెదిరించడం కూడా జిల్లాలో పెచ్చుపెరిగాయి. హ్యూమన్ రైట్స్ అంటూ ఎర్రటి పెద్ద అక్షరాలను కార్ల మీద వేసుకుని వీరు దబాయించి మరీ తిరుగుతూ ఉన్నారు.

నిజమైన సంఘాలు రెండే!

వాస్తవంగా జాతీయ స్థాయిలో జాతీయ మానవహక్కుల కమిషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర మానవహక్కుల కమిషన్ అనేవి మాత్రమే రాజ్యాంగబద్ధమైనవి. రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి అధ్యక్షతన జాతీయ మానవహక్కుల కమిషన్ ఏర్పడుతుంది. హైకోర్టు రిటైర్డ్ జడ్జి చైర్మన్‌గా రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ఏర్పడుతుంది. వీటిల్లో రిటైరైన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సామాజిక కార్యకర్తలు సభ్యులుగా ఉంటారు. వీరికి మాత్రమే ప్రొటోకాల్ ఉంటుంది. మానవహక్కుల ఉల్లంఘనపై ఫిర్యాదులు అందితే ఈ కమిషన్‌లు సీరియస్‌గా తీసుకుంటాయి. కొన్ని సందర్భాల్లో సుమోటోగా కూడా స్వీకరిస్తాయి.

నకిలీల జోరు

పౌరుల హక్కులకు భంగం కలిగినపుడు మేధావులతో కూడిన మానవహక్కుల సంఘాలు స్పందిస్తాయి. నిజనిర్ధారణ జరిపి వాస్తవాలు వెల్లడిస్తాయి. ఇటువంటి పనిని రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, మానవహక్కుల వేదిక అనేక దశాబ్దాలుగా చేస్తున్నాయి. బాధితుల పక్షాన కోర్టుల్లో కేసులు కూడా వీరు నడుపుతారు. అయితే జిల్లాలో హ్యూమన్‌రైట్స్ పేరుతో ఇబ్బడిముబ్బడిగా సంఘాలు చలామణి అవుతున్నాయి.

విచిత్రం ఏమిటంటే హ్యూమన్ రైట్స్ సంఘాల పట్ల తగిన అవగాహనలేకపోవడంతో పోలీసులు కూడా వీరి దబాయింపులకు జంకిపోతుంటారు. కొందరు వీరికి సహకరిస్తూ కూడా ఉంటారు. ఇదే వీరికి పెట్టుబడిగా మారింది.

హ్యూమన్ రైట్స్ బోర్డులతో కార్లు

జిల్లాలో హ్యూమన్ రైట్స్ అనే బోర్డులతో తిరిగే వాహనాల జోరు చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. బుగ్గకార్లు కూడా ఉన్నాయి. సైరన్లు సైతం మోగిస్తూ వీరు హడావుడి చేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రదేశాల్లో, హైవేల టోల్‌గేట్‌ల వద్ద, పెయిడ్ పార్కింగ్‌ల వద్ద వీరి దబాయింపు కనిపిస్తుంది. ఈ వాహనాల మీద హ్యూమన్ రైట్స్ చైర్మన్, ప్రెసిడెంట్, సెక్రటరీ వంటి బోర్డులుండడం విశేషం. జిల్లాలో మానవహక్కుల కమిటీల పేరుతో దాదాపు 70కి పైగా వాహనాలు తిరుగుతున్నాయంటే వీరి రుబాబు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క తిరుపతి నగరంలోనే 30 వాహనాలు తిరుగుతున్నాయి. పోలీసులూ, రవాణా అధికారులు కూడా ఎందుకొచ్చిన తంటా అనుకుని వీటి జోలికి వెళ్లడం లేదు. ఎర్రచందనం, గంజాయి వంటి మాదకద్రవ్యాల రవాణాకు కూడా ఈ వాహనాలు వాడుకుంటున్నారనే ఆరోపణ ఉంది.




జిల్లా వైస్ ప్రెసిడెంట్ బోర్డుతో.. - రాష్ట్ర కార్యదర్శి హోదా బోర్డుతో..

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

రెవెన్యూ సదస్సులకు 696 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 696 అర్జీలు అందినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. 32 గ్రామ సభలను ఏర్పాటు చేయగా భూ కబ్జాలపై 16 ఫామ్‌ఏలపై 11, ఇళ్ల స్థలాలకు 53, ఆర్ఓఆర్‌పై 283, అసైన్మెంట్ ల్యాండ్‌పై 41, ఇతర విషయాలకు సంబంధించి 223 అర్జీలు వచ్చాయని వివరించారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను కాల పరిమితి లోపల సంబంధిత అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు.

21 నుంచీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులకు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరీక్షల విభాగం చేపడుతోంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు.

3, 5 సెమిస్టర్‌లో నలుగురు డీబార్

ఎస్వీయూ పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ చిత్తూరులో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని గుర్తించి డీబార్ చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.



కలెక్టరేట్ వద్ద సైదమ్మ

అనాథలకు ఆధార్ ఇవ్వరా?

'ఏర్పేడు మండలం వికృతమాల పునరావాస కేంద్రంలో 40మంది అనాథలు ఆశ్రయం పొందుతున్నారు. వారికి ఆధార్ కార్డులు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ఇప్పటికే చాలాసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు' అంటూ ఆశ్రమ నిర్వాహకురాలు సైదమ్మ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతిపత్రం ఇచ్చారు.

- మరిన్ని వినతులు.. ఫిర్యాదులు 6లో

టీడీఆర్ బాండ్ల విచారణ వేగవంతం

తిరుపతి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై నివేదికకు తుదిరూపు ఇచ్చేందుకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) సిద్ధమైంది. విచారణ నిమిత్తం రికార్డులను తీసుకు రావాలని ఆదేశించింది. ఈమేరకు విజయవాడ వడ్డేశ్వరంలోని డీఎంఏ కార్యాలయానికి అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలని టౌన్‌ప్లానింగ్ అనంతపురం రీజనల్ డైరెక్టర్ జి.ఆర్.సంజీవ్ కుమార్ కమిషనర్ మౌర్యను నాలుగు రోజుల క్రితం లిఖిత పూర్వకంగా కోరారు. టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ ఎస్.మహాప్రాత, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పి.వినయ్ కుమార్, వై.పురుషోత్తం రెడ్డి, డి.శ్రవణ్ కుమార్‌లు రికార్డులతో డీఎంఏ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గత వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

విజయవాడకు రికార్డులు తీసుకురండి

'కూటమి' అధికారంలోకి వచ్చాక..

గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీలపై విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా జరిగిన శాఖాపరమైన విచారణలో తిరుపతి టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మరింత సమగ్ర విచారణకు అనంతపురం టౌన్ ప్లానింగ్ ఆర్డీ నేతృత్వంలో డీఎంఏ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన రికార్డులను వెంటపెట్టుకుని రావాలని డీసీపీతో పాటు వార్డు సెక్రటరీలను ఆదేశించినట్టు సమాచారం. డీసీపీ మహాప్రాత సమర్థత, నిజాయతీపై నమ్మకంతో విచారణలో ఆయనే కీలకం కానున్నట్టు తెలుస్తోంది.

కౌన్సిల్ ప్రతిపాదించిన 42 రోడ్లలో ఇప్పటివరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1121 మంది భూములు కోల్పోయారు. వీరిలో 373 మందికి మాత్రమే టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఇంకా 1200కు పైగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటివరకు రూ1,013 కోట్లు టీడీఆర్ బాండ్లు జారీచేశారు. ఇందులో 75 శాతం టీడీఆర్ బాండ్లు వినియోగం జరిగిపోయిందని, తక్కిన 25 శాతం మాత్రమే ఉన్నట్టుగా తెలుస్తోంది.



విజిలెన్సు దూకుడు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల విచారణలో విజిలెన్సు చురుగ్గా వ్యవహరిస్తోంది. విచారణలో భాగంగా మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేసిన సమయంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయి? కాలువ పోరంబోకు, చెరువు పోరంబోకు, డీకేటీ భూములు ఉన్నాయా? ఉంటే వాటిని రికార్డుల్లో చూపకుండా పట్టా భూములు సేకరించినట్లు చూపించి అధిక ధర ఏమైనా చెల్లించారా? అని తెలుసుకోవడానికి తిరుపతి అర్బన్ సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్లకు లేఖలు రాసినట్లు సమాచారం. ఏయే సర్వే నెంబర్లలో ఎంత భూమి సేకరించారు? అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత విలువకు టీడీఆర్ బాండ్లు చెల్లించారు? మార్కెట్ విలువ కంటే ఎక్కువగా ఏమైనా భూమి విలువ నిర్ధారించి టీడీఆర్ బాండ్లు జారీ చేశారా అనే కోణంలోనూ విచారణ చేయనున్నారు. దీనికోసం అటు మార్కెట్ విలువ, ఇటు భూముల వివరాలు తెప్పించి వివిధ కోణాల్లో దర్యాప్తు చేయనున్నట్లు విజిలెన్సు అధికారి ఒకరు చెప్పారు. కాగా, రెసిడెన్షియల్ ఏరియాను కమర్షియల్‌గా చూపి టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు విజిలెన్సు విచారణలో తెలిసినట్లు సమాచారం. ఉదాహరణకు.. పూలవానిగుంట రోడ్డులో అరకిలోమీటరు పొడవున మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటు చేశారు. దీనికోసం ఆరుగురికి టీడీఆర్ బాండ్లు ఇచ్చారు. ఈ రోడ్డులో రెసిడెన్షియల్ ప్లాట్లు ఉన్నప్పటికీ అధిక ధర కోట్‌చేసి కమర్షియల్ ప్లాట్లుగా రికార్డులు సృష్టించినట్లు సమాచారం. ఇక 150 మీటర్ల పొడవున్న నారాయణపురం రోడ్డులో ఒక టీడీఆర్ బాండు ఇచ్చారు. ఇక్కడా నిధులు గోల్‌మాల్ జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్ నుంచి రేణిగుంట రోడ్డును కలుపుతూ ఏర్పాటు చేసిన 1.56 కిలోమీటర్ల 40 అడుగుల రోడ్డులో 156 మందికి టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో ఇన్ని బాండ్లు పంపిణీ చేశారా అనేదీ ఆరా తీస్తున్నారు. కాగా, మూడు రోజుల కిందటి వరకు పది రోడ్ల వరకు విచారణ పూర్తయినట్లు తెలిసింది. మిగతా రోడ్లకు సంబంధించి వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు విజిలెన్సు అధికారి ఒకరు చెప్పారు.

సెట్ బ్యాక్‌లకూ టీడీఆర్..!

భవన నిర్మాణంలో విడిచిపెట్టిన సెట్‌బ్యాక్‌లకు కూడా టీడీఆర్ బాండ్లు ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. కొంతమంది స్థల యజమానులకు తెలియకుండానే బాండ్లు జారీ అయినట్లు చెబుతున్నారు. కొన్ని రోడ్ల వెడల్పు, పొడవులోనూ మతలబు చోటుచేసుకున్నట్లు విజిలెన్సు విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. ఉదాహరణకు 40 అడుగుల రోడ్డుకుగాను.. తమకు కావాల్సిన వారి భవనాలు, దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్సులున్న చోట 30 అడుగులు మాత్రమే రోడ్డు వేసి.. మిగిలిన భూమి సేకరించినట్లు రికార్డుల్లో నమోదు చేసినట్లు విమర్శలున్నాయి. వీటన్నింటిపైనా విజిలెన్సు దృష్టి పెట్టింది.

పుత్తూరు కేంద్రంగా పేట్రేగుతున్న బియ్యం స్మగ్లర్లు

పట్టుబడిన 2,250 కిలోల రేషన్ బియ్యం ● ముగ్గురు నిందితుల అరెస్టు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కేంద్రంగా రేషన్ బియ్యం ముఠా పేట్రేగిపోతోంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో అవలీలగా రేషన్ బియ్యాన్ని తరలించేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో పుత్తూరు కేంద్రంగా రూ.2.05 కోట్ల రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ విష్ణు నల్లబజారుకు తరలించిన సంఘటన తెలిసిందే. తాజాగా 2,250 కిలోల రేషన్ బియ్యం స్థానిక కాపు వీధిలో ఓ ముఠా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. బియ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ సురేంద్రనాయుడు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఈ నెల 3న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు, ఈ ముఠా వెనుక ఎవరు ఉన్నారన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ గోదాంలో జరిగిన బియ్యం అవినీతి ముఠా హస్తంపై విచారించారు. చివరకు పట్టుబడిన నిందితులు చిన్న వ్యాపారులుగా గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి లక్ష్మీ, చిన్న, అమృతరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సోమవారం పట్టుబడిన బియ్యాన్ని పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంకు తరలించారు.



గోదాంకు తరలిస్తున్న రేషన్ బియ్యం

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడ్డ రేషన్ బియ్యం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పడమటి వీధిలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రక్తం లేదు.. తిరుపతికి వెళ్లండి

● చివరి నిమిషంలో గర్భిణులను రెఫర్ చేస్తున్న డాక్టర్లు

శ్రీకాళహస్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏ గ్రూప్ రక్తమూ లేదని అధికారులు చేతులెత్తేస్తున్నారు. ఇదే సాకుగా చూపుతూ వారం రోజులుగా గర్భిణులను చివరి నిమిషంలో తిరుపతికి రెఫర్ చేస్తున్నారు.

● తొట్టంబేడు మండలం కన్నలికి చెందిన మంజూషా కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. ఈ నెల 2 నుంచి వీరు వైద్య పరీక్షలకు వస్తున్నారు. వైద్యుల సూచన మేరకు సోమవారం ఉదయం కాన్పు కోసం ఏమీ తినకుండా ఆమె వచ్చారు. ఆపరేషన్ థియేటర్‌లో ఎనిమా ఇచ్చాక రక్తం లేదని చెబుతూ తిరుపతికి రెఫర్ చేయడంపై ఆమె కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి నిమిషంలో ఇలా ఎలా రెఫర్ చేస్తారంటూ వైద్యులను నిలదీశారు.



● సోమవారమే శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ యువతిని రక్తం లేదన్న కారణంతో నెల్లూరుకు రెఫర్ చేశారు. ఒకరోజే ఇద్దరు గర్భిణులను రెఫర్ చేయడం సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

● అలాగే శ్రీకాళహస్తి మండలం జింగిలిపాళేనికి చెందిన గర్భిణి ఖుష్బును ఏడు రోజులపాటు ఆస్పత్రికి తిప్పుకొన్నారు. శనివారం, చివరి నిమిషంలో రెఫర్ చేశారు. దీంతో ఆమె కుటుంబీకులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలపైనే 108 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వికృతమాల హౌసింగ్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వికృతమాల హౌసింగ్ కాలనీవాసులు

ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని హౌసింగ్ కాలనీలో కనీస వసతులు కల్పించాలని వికృతమాల ప్రభుత్వ గృహాల అభివృద్ధి కమిటీ నేతలు శివయ్య, గోవర్ధన్, పుష్పరాజ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందని, వీధి దీపాలు లేవని, చీకటిపడితే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఏనుగుల నుంచి రైతులను కాపాడండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న రామానాయుడు

ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం అందించారు. పది రోజులుగా 17 ఏనుగులు గుంపుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి, పలమనేరు, వి.కోట, గంగవరం మండలాల్లో ఏనుగులు స్వైర విహారం చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, పద్మనాభరెడ్డి, రైతు మల్లికార్జున పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

● మందుబాబు తీరుతో

రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం



ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మద్యం తాగాడు. ట్రాన్స్‌ఫార్మరు వద్ద కరెంటు సరఫరా ఆపేశాడు. ఆపై దానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇతడి చర్య వల్ల శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌లో రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొదట సాధారణ అంతరాయంగా స్థానికులు భావించారు. అరగంట తరువాత తాగుబోతు పనిగా గుర్తించారు. అతడిని వెదికి పట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళాన్ని తీయమని చెబితే.. అతడు వినలేదు. తనను ప్రశ్నించిన వారిపై బూతుల దండకంతో విరుచుకుపడ్డాడు. దాడికీ యత్నించాడు. ఇలా గంటపాటు వీరంగం చేశాడు. విసిగిపోయిన స్థానికులు డిస్కం అధికారులకు, వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి మందుబాబుకు దేహశుద్ధి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం తీయించారు. మొత్తంమ్మీద రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా లేకుండా చేశాడు. దీనిపై డిస్కం అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎన్టీఆర్ నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ 600 ఎకరాలు తిరిగి అప్పగించండి!

ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి అధికారుల ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించండి. నూతన పరిశ్రమల స్థాపనకు వాటిని కేటాయించడానికి అవకాశం ఉంటుంది' అని కంపెనీ ప్రతినిధులకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ సూచించారు. ఏపీఐఐసీ ఎండీ అభిషిక్తకిషోర్‌తో కలసి సోమవారం సోమవారం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, సదరు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్నవరం వద్ద ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎన్‌బీపీపీఎల్) పవర్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 2009లో భూములు కేటాయించారు. ఈ భూ అంశం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉందని ఆ కంపెనీ ప్రతినిధులు వివరించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడానికి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఐఐసీ అధికారులను యువరాజ్ ఆదేశించారు.

అటకెక్కిన శిల్పారామం మాస్టర్‌ప్లాన్



శిల్పారామం ముఖద్వారం - స్టాల్స్, హట్స్



● అభివృద్ధి కోసం 2019లో రూ.10 కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం

● కక్షతో నిధులను రద్దు చేసిన జగన్ ప్రభుత్వం

● ఆదాయం పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు

శిల్పారామం అభివృద్ధికి పదికోట్ల రూపాయలతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ముందుకు కదలడం లేదు. ఏటా సందర్శకుల సంఖ్య, ఆదాయం పెరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉరుకుల పరుగుల జీవనంలో నగరవాసులకు కాసింత సేదతీర్చేందుకు పట్నంలో పల్లె అనుభూతి కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 22 ఏళ్ల క్రితం తిరుచానూరు రోడ్డులో శిల్పారామం (అర్బన్‌హట్)ను ఏర్పాటు చేశాయి. అప్పటి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కాశీరామ్ రాణా చేతుల మీదుగా 16 ఎకరాల ప్రాంగణంలో మట్టి బొమ్మల సోయగాలు, పల్లె సొగసులను హత్తుకునేలా అర్బన్ హట్ ప్రారంభమైంది. భారతీయ సంప్రదాయ కళలు నేటి తరానికి అందించడానికి శిల్పారామంలో అనేక కళా, వస్తు ప్రదర్శనలు ఉన్నాయి. ప్రారంభ రోజుల్లో 150 మంది సందర్శకులు మాత్రమే వచ్చేవారు. నేడు ఆ సంఖ్య 900 మందికి చేరింది. శని, ఆదివారాల్లో ఈ సంఖ్య పెరుగుతోంది. తద్వారా ఆదాయమూ పెరుగుతూ వచ్చింది.

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ఇవే

శిల్పారామం (అర్బన్‌హట్)లో సందర్శకుల కోసం మరిన్ని సౌకర్యాలు సమకూర్చడానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షతో ఈ కేటాయింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల ఫలితంగా ఎట్టకేలకు 2020 అక్టోబరులో జగన్ ప్రభుత్వం తిరిగి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులు చేపట్టేందుకు అనుమతించింది. మాస్టర్‌ప్లాన్‌ను ఓ ప్రైవేట్ ఆర్కిటెక్ సంస్థచే రూపొందించారు. ఈ ప్రతిపాదనలో ఆర్చితో కూడిన ప్రవేశ ద్వారం వద్ద ప్లాజా నిర్మాణం, సందర్శకుల సౌకర్య కేంద్రాలు, వాటర్ ఫౌంటెన్, కళాత్మకమైన గ్రామీణ వాతావరణంతో వివిధ రకాల స్టాళ్ల ఏర్పాటు, చేతి వృత్తులు, కళాకారులకు శిక్షణ కేంద్రం, ఎంపోరియం, వివిధ స్మారక చిహ్నాలతో కూడిన దుకాణాలు, ఫుడ్‌కోర్టు, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఆధునీకీకరణ లాంటి పనులకు ఈ నిధులను వ్యయం చేయాల్సి ఉంది. గడచిన నాలుగేళ్ల వైసీపీ పాలనలో శిల్పారామం మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆ పది ఎకరాలపై దృష్టి పెట్టండి

శిల్పారామం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో మరో పది ఎకరాలను కేటాయించడానికి అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అంగీకరించారు. అందులో బోన్సాయ్, బటర్‌ఫ్లై, రాక్ గార్డెన్స్ ఏర్పాటుకు శిల్పారామం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ స్థలాన్ని సైతం వైసీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నించారు.

కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

స్థానికులకు మానసికోల్లాసం అందించడమేగాక ఏడాదికి సుమారు రూ.2 కోట్లు ఆదాయం వస్తున్న శిల్పారామంలో మాస్టర్‌ప్లాన్ పనులు వేగవంతం చేసి, కొత్త సొబగులు దిద్దితే సందర్శకుల సంఖ్యతోపాటూ జిల్లా పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీసిటీని సందర్శించిన హిరోషిమా ప్రతినిధుల బృందం



శ్రీసిటీలో ప్రతినిధుల బృందం

శ్రీసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులు, వైవిధ్య భరితమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, వ్యాపార అనుకూల వాతావరణంలో నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని హిరోహరు సకనే నేతృత్వంలోని బృందం అభినందించింది. జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 30పైగా జపనీస్ పరిశ్రమల స్థాపనతో భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ గుర్తింపు పొందిందని వారికి వివరించారు. పర్యటనలో పాల్గొన్న ప్రతినిధులు శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి విపులంగా అడిగి తెలుసుకున్నారు. హిరోషిమా అధికార ప్రతినిధుల బృందం పర్యటనపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత్, హిరోషిమా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా ఆయన పేర్కొన్నారు. ప్రతినిధుల బృందంలో హిరోషిమా ప్రభుత్వ అధికారి యుద్దై హరున్, హిరోషిమా బ్యాంక్ లిమిటెడ్ అధికారులు తకుషి కొసాకా, హిరోకి ఒనిషి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

డైరెక్టర్ సత్యనారాయణ



తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ప్రాంగణం ఈనెల 11 నుంచి రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు సిద్ధమవుతున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఐఐటీకి ఈ అవకాశం రావడం గర్వకారణమన్నారు. దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నాయకత్వం వహించడానికి విద్యామంత్రిత్వశాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ ఒకటిగా గుర్తింపబడిందన్నారు. ఇదో మైలు రాయి అన్నారు. హ్యాకథాన్ ఎలైట్ టీంల కలయికకు సాక్షమివ్వనుందని అభిప్రాయపడ్డారు. ప్రతి బృందంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగులు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులు ఉంటారన్నారు. వీరు ఆయూష్ మంత్రిత్వశాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమ్యల ప్రకటనలకు పరిష్కారం రూపొందించటానికి పోటీ పడతారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే టీంలు వారి అసాధారణమైన సమస్యాపరిష్కారం నైపుణ్యాలను వినూత్న ఆలోచనలు ఎంపిక చేయబడుతాయన్నారు. ప్రతి సమస్య ప్రకటనపై విజేతలకు భారత ప్రభుత్వం నగదు బహుమతులను అందించి సత్కరిస్తుందని తెలిపారు. యువతలో పరిశోధన, అభివృద్ధి, సంస్కృతిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే భారతదేశ విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వేదికగా మాత్రమే కాకుండా దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కొత్త తరం ఇంజనీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించటంలో తిరుపతి ఐఐటీ ముందంజలో ఉందని ఆయన అన్నారు.

అధికారులూ.. అభినందనలు

అమ్మవారి బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎక్స్‌లో సీఎం పోస్ట్





తిరుచానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం పట్ల సీఎం చంద్రబాబు సోమవారం టీటీడీని అభినందించారు. ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల దివ్య వైభవాన్ని వీక్షించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. టీటీడీ ప్రణాళికాబద్ధంగా ముందు చూపుతో ఏర్పాట్లు చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయడం వల్ల భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందేలా చేశారని సీఎం అభినందించారు.

తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు

● కర్ణాటక భక్తుడి ట్వీట్‌కు ఎక్స్‌లో మంత్రి లోకేశ్ స్పందన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'మీ తర్వాతి పర్యటనలో తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు' అంటూ శ్రీవారి భక్తుడి ట్వీట్‌కు ఎక్స్ వేదికగా స్పందించారు మంత్రి నారా లోకేశ్. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. కర్ణాటకకు చెందిన కెంచా అనే పేరుతో ఎక్స్ వేదికగా తిరుమలలోని సౌకర్యాలపై ఓ భక్తుడు ట్వీట్ చేశారు. 'గతంతో పోలిస్తే తిరుమలలో పరిశుభ్రత ఉంది. మరుగుదొడ్లతో పాటు రోడ్లు కూడా శుభ్రంగా కనిపిస్తున్నాయి. శ్రీవారి దర్శన సమయం తగ్గడంతో పాటు క్యూలైన్ నిర్వహణ, అన్నప్రసాదాలు బాగున్నాయి. లడ్డూ నాణ్యత కూడా పెరిగింది. గతంలో లడ్డూ కేవలం రుచి చూసేవాడిని. ఇప్పుడు పూర్తి లడ్డూనే తింటున్నా. ఐదురోజులు ఉంచినా తాజాగా ఉంటోంది. ఎలాంటి కొరత లేకుండా లడ్డూలు ఇస్తున్నారు. ఇక, గదుల కొరత అధికంగా ఉంది. ఉచిత బస్సులు రద్దీగా ఉంటున్నాయి' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కర్ణాటక భక్తుడైన తాను ఏపీ రాజకీయాలను పెద్దగా పట్టించుకోనని పేర్కొన్నారు. తరచూ తిరుమలకు వచ్చే భక్తుడిగానే చెబుతున్నానని తెలిపారు. 'తిరుమలలోని మార్పులను ప్రశంసించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు పరిపాలన, దార్శనికత కారణంగానే తిరుమలలో పారిశుధ్యం, లడ్డూ రుచి, అన్నప్రసాదం నాణ్యత, శ్రీవారి దర్శనం మెరుగుపడ్డాయి. వసతి, ఉచిత బస్సులు వంటి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం. తర్వాతి మీ తిరుమల పర్యటనలో మరిన్ని మార్పులను చూస్తారు' అంటూ కర్ణాటక భక్తుడి ట్వీట్‌పై నారా లోకేశ్ స్పందించారు.

ముంగిలిపట్టు వద్ద అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



శ్రావణి (ఫైల్ ఫొటో)



కార్తీక్

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన శ్రావణి(23)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముంగిలిపట్టు వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని యువతి మృతదేహం రక్తపు మడుగులో పడుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ అనిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద రెండు జతల చెప్పులున్నాయి. సాయంత్రం 6 గంటల సమయంలో బైక్‌పై తిరుపతి నుంచి ఓ యువకుడితో వస్తూ ఆమె ఏడుస్తూ వాదిస్తోందని కొందరు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన రవి కుమార్తె శ్రావణిగా తేలింది. తిరుపతిలో రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తోంది. ఆమెతో పాటు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కమ్మవాండ్లపల్లెకు చెందిన రామ్మూర్తి కుమారుడు కార్తీక్ కూడా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా వీరి మధ్య పరిచయం ఉంది. శ్రావణికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుస్తోంది. దీనిపై శ్రావణితో మాట్లాడేందుకు కార్తీక్ తిరుపతి నుంచి బైక్‌పై ముంగిలిపట్టుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. కాగా, చంద్రగిరి జాతీయ రహదారి వద్ద కార్తీక్ ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. ఈ వాదులాట నేపథ్యంలో అతడు ఆమెను రోడ్డుపైకి తోసేశాడా లేదా శ్రావణి ఆత్మహత్య చేసుకొందా? లేక రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్టు



నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్టణం నుంచి నాయుడుపేటకు గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సోమవారం మీడియాకు వెల్లడించారు. నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, వెంకటేష్, చక్రవర్తి, నాయుడుపేట పట్టణానికి చెందిన వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మకు గంజాయిని సరఫరా చేస్తుంటారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు నిఘా వేశారు. గంజాయి విక్రయిస్తున్న వెంకటేష్, చక్రవర్తి, వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 25 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షల విలువ ఉంటుందని చెప్పారు. కాగా, నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, పరారయ్యారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనపరచిన అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు భవానీ లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది నాగూరయ్య, రామమోహన్‌రాజు, సాహుల్, భానుతేజ, పోలయ్య, మురళి, షాహిదా, చందన, సుప్రజను డీఎస్పీ అభినందించారు.


నేటితో ముగియనున్న పింఛన్ల పరిశీలన

తిరుపతి(మంగళం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనర్హత పింఛన్ల ఏరివేతకు రూపొందించిన పైలెట్ కమిటీ ప్రాజెక్ట్ పరిశీలన మంగళవారంతో ముగియనుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పరిశీలనలలో 15 అనర్హత పింఛన్లను గుర్తించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామపంచాయతీ, వార్డు సెక్రటేరియట్ పరిధిలో పింఛనుదారుల వ్యక్తిగత పరిశీలన కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోన వార్డు సచివాలయ పరిధిలో 355 పింఛనుదారులకు గాను 322 పరిశీలించామన్నారు. సోమవారం పరిశీలన ముగిసే సమయానికి 32 మందిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ 32 మందిలో ఒకరు మరణించారని, 31 మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారన్నారు. మంగళవారం తనిఖీ ప్రారంభయమ్యే సమయానికి వారి చిరునామా గల నివాసాల వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ పింఛనుదారుల పరిశీలనలో శ్రీకాళహస్తి డీఎల్‌డీవో సుస్మితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధిక, పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా నమోదు ప్రారంభం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జిల్లాలో మామిడి పంటకు బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఉద్యానశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2024-25 రబీసీజన్‌కు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సమీపంలోని బ్యాంకులోగాని లేదా మీసేవ, బీమా కంపెనీ నియమించిన వారి ద్వారానైనా ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, భూమిపాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను అందించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో బుధ, గురువారాల్లో సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుంది. దీనికోసం జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి' అని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధశాఖల వారీగా పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, రూ.3.58 కోట్లు ఆదాయం లభించినట్లు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 73,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,721 మంది తలనీలాలు సమర్పించారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వీఎస్‌యూ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కిర్మమయి, డీఎస్పీ రమణకుమార్

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు పట్టుదలతో ప్రయోగాలు చేయడం ద్వారా శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని విక్రమ సింహపురి యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ కిర్మమయి అన్నారు. సోమవారం స్థానిక దువ్వూరు రమణమ్మ మహిళా జూనియర్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థినుల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసేందుకు వీలుంటుందన్నారు. 5వ ఏపీ గర్ల్స్ బెటాలియన్ కల్నల్ అనుజ్ వాద్వా మాట్లాడుతూ ఎన్‌సీసీ దేశంలోనే గర్వించదగ్గ విభాగంగా గుర్తింపు సాధించిందన్నారు. విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరి దేశానికి సేవచేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. డీఎస్పీ రమణకుమార్ మాట్లాడుతూ మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు. మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చట్టాలను అమలు పరుస్తుందని, వీటిపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. పురుషులకు దీటుగా ప్రతిరంగంలోనూ మహిళలు రాణించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలను తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో కళాశాల కోశాధికారి విద్యాసాగర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత్‌రావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్, డాక్టర్ గాయత్రి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్రికెట్ జట్టుకు గూడూరు క్రీడాకారుడు



క్రీడాకారులతో మునిగిరీష్ తదితరులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అండర్-14 రాష్ట్రస్థాయి జట్టు ప్రాబబుల్‌కు గూడూరుకు చెందిన క్రీడాకారుడు లీలావికాస్ ఎంపిక కావడం సంతోషకరమని నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మునిగిరీష్ అన్నారు. సోమవారం స్థానిక ఏఆరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఆయన మాట్లాడుతూ గూడూరులోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సబ్‌సెంటర్ నుంచి ఇప్పటి వరకు 6మంది క్రీడాకారులు రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెలలో విజయనగరంలో జరగనున్న అండర్-14 రాష్ట్ర క్రికెట్ జట్టు ప్రాబబుల్స్ మ్యాచ్‌కు లీలామోహన్ ఎంపికయ్యాడన్నారు. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిస్తే రాష్ట్ర జట్టులో అవకాశం దక్కుతుందన్నారు. లీలావికాస్ ప్రతిభచాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లవకుమార్, నాగేశ్వరరావు, నూర్ మహ్మద్, మధు, సుబ్రహ్మణ్యం, రజిని, విజయ్‌కుమార్, మహేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ షరీనా

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మనపాటి శ్రీనివాసరావు దాతృత్వంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా మాట్లాడుతూ ప్రతినెలా జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయ మన్నారు. జేవీవీ సైన్స్ పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. కార్యక్ర మంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, ప్రభాకర్, ఆనంద్, సుబ్బారావు, మస్తాన్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



లాంగ్ జంప్ చేస్తున్న బెటాలియన్ సిబ్బంది

వెంకటగిరి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఆరోగ్యం లభిస్తుందని 9వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అరుణ్ బోస్ అన్నారు. సోమవారం బెటాలియన్‌లో యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా బెటాలియన్‌లో గేమ్స్ నిర్వహిస్తున్నామని, దీని ద్వారా సిబ్బందికి శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ పాల్గొంటారని తెలిపారు.

'వినోద్ కుటుంబాన్ని ఆదుకుంటాం'

నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో మేల్ కంపౌండర్‌గా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన పూండ్ల వినోద్‌కుమార్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎంఎస్‌ఎం ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. సోమవారం నాయుడు పేట మాలయ కోటలోని వినోద్‌కుమార్ స్వగృహానికి వెళ్లి ఆయన సతీమణి సునీత, కుమార్తె వింధ్య, కుటుంబసభ్యులను పరామర్శించారు. వినోద్ కుమార్ కంపౌండర్‌గా ఉంటూనే అత్యవసర పరిస్థితుల్లో, యాక్సిడెంట్ సమయాల్లో ఎనలేని సేవలు అందించేవారని గుర్తు చేసుకున్నారు. వినోద్ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందేలా చూడడంతో పాటు కారుణ్య నియామకం కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తామన్నారు.

జిల్లా అభివృద్ధిలో పురోగతి సాధించండి

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో ఆయా శాఖల అధికారులు పురోగతి సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం శాఖల వారీగా ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, పురోగతి సాధించాలని సూచించారు. జేసీ శుభం బన్సల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్: యువకుడి మృతి

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. దొరవారిసత్రం మండలం మేలనాలతూర్పు గ్రామానికి చెందిన వేలూరు తులసీరామ్(33) అపాచీ పరిశ్రమలో పనిచేస్తూ సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నాడు. సోమవారం ఉదయం పరిశ్రమకు వెళ్లాడు. విధుల్లో ఉండగా పనిఉందంటూ అనుమతి తీసుకొని సూళ్లూరుపేటకు బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డులోని ఓ చెప్పుల పరిశ్రమ వద్ద వేగంగా వెళ్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తులసీరామ్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మూత్ర విసర్జన చేస్తే జరిమానా

నాయుడుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎక్కడైనా, ఎవరైనా బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా అన్నారు.

నిరుపయోగంగా ఆర్టీసీ బస్టాండు

నిర్వహణ గాలికి ● హైవేలో వెళ్లిపోతున్న బస్సులు





బస్సులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న చిల్లకూరు ఆర్టీసీ బస్టాండు - అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

చిల్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరులోని ఆర్టీసీ బస్టాండు నిరుపయోగంగా మారింది. చిల్లకూరులో సుమారు 25 ఏళ్ల క్రితం ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని వసతులతో బస్టాండు నిర్మించారు. తొలినాళ్లలో బస్టాండు ప్రయాణికుల రద్దీతో కళకళాడుతుండేది. అయితే క్రమేణా బస్టాండులోకి బస్సులు రాకపోవడంతో పాటు నిర్వహణను ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చే బస్సులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు నేరుగా జాతీయ రహదారిపై వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండులోకి బస్సులు, ప్రయాణికులు రాకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, యాచకులకు నిలయంగా మారింది. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

అభివృద్ధికి ప్రజలు సహకరించాలి: కురుగొండ్ల



ఆర్చి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. సోమవారం క్రాస్‌రోడ్డు వద్ద తన సొంతనిధులు రూ.22 లక్షలతో చేపడుతున్న గ్రామశక్తి పోలేరమ్మ ఆర్చి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామశక్తి పోలేరమ్మ జాతర విశిష్టతను తెలియజేప్పేలా వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద ఆర్చి నిర్మాణాన్ని చేపడుతు న్నట్లు తెలిపారు. దీని వల్ల క్రాస్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలను పాలకేంద్రం వైపునకు మళ్లించామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్రంలోనే గుర్తింపు పొందేలా వెంకటగిరి పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు తనవంతు కృషిచేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో పార్కు ఏర్పాటుకు స్థలాలను గుర్తించడం జరిగిందని, ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి కొంత, తన సొంత నిధులు, దాతల సహకారంతో సమకూర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపేడు రవి, కాపా శ్రీనివాసులు, సీకేపల్లి బాబు నాయుడు, కొల్లాపురి సుధా, చెంగారావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయానికి సమష్టిగా కృషి చేయాలి: నెలవల



పార్టీ నాయకులకు సూచనలు ఇస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కోరారు. సోమవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. విజయమే లక్ష్యంగా అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, కానూరు వరప్రసాద్‌రాజు, గోపాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న సంచి కృష్ణయ్య

పెళ్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా పెళ్లకూరు మండలంలో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వ నమోదు చేశామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 5వేల మందికి పైగా టీడీపీలో సభ్యులుగా చేర్పించినట్లు ఆయన వివరించారు. ఇదంతా 24 పంచాయతీల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టి కృషి ఫలితమేనని అన్నారు. త్వరలోనే 10 వేల మైలురాయిని చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాటంరెడ్డి మల్లిఖార్జున్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని వాక్యం, నిండలి గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ శీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 17, హక్కులు కల్పించాలని 6, దారి సమస్యలపై రెండు, ఒకే భూమికి ఇద్దరికి పట్టాలిచ్చారని నాలుగు అర్జీలు అందాయి. కార్యక్రమంలో సర్పంచు కృష్ణయ్య, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు పాల్గొన్నారు.

బంగారమ్మ గ్రామోత్సవం



అమ్మవారి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో గ్రామదేవతల ఉత్సవాల్లో భాగంగా సోమవారం బంగారమ్మ గ్రామోత్సవం జరిగింది. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం చిట్టేడు, ఎస్‌బీటీ కాలనీలో మేళతాళాల నడుమ అమ్మవారి కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు సామూహిక పొంగళ్లు పెట్టారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు



క్రాస్‌రోడ్డులో పాత సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట క్రాస్‌రోడ్డు, ఆర్టీసీ సెంటర్, విద్యానగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పరిశీలించారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల వితరణ

తడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక తడకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు సూళ్లూరుపేటకు చెందిన సురేంద్రబాబు దంపతులు భోజన ప్లేట్లను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తోలిమిట్ట ప్రభుత్వ పాఠశాలలో శ్రీనివాస సేవా ట్రస్టు(టీవీఎస్) ఆధ్వర్యంలో తిరుపతి అరవింద ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. స్క్రీనింగ్ టెస్టర్ ఎస్.శంకర్ మాట్లాడుతూ 52మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామని, వీరిలో ఇద్దరికి చూపు సమస్య ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో టీవీఎస్ ప్రతినిధి సురేష్, ఉదయకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, రామకృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలైకు 34 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు కేంద్రంగా సికింద్రాబాదు, కాచికూడ, మౌలాలి, హైదరాబాదు రైల్వే స్టేషన్ల నుంచి శబరిమలై భక్తుల సౌకర్యార్థం నుంచి రేణిగుంట మీదుగా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్‌వో ఏ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాదు-కొట్టాయం, సికింద్రాబాద్ 8 సర్వీసులు

హైదరాబాదులో ప్రత్యేక రైలు(07065) జనవరి 7, 14, 21, 28 తేదీల్లో రాత్రి 12 గంటలకు బయలుదేరి బేగంపేట, లింగంపల్లి, శంకరపల్లి, వికారాబాదు, తాండూరు, సేరం, సులేహల్లీ, యాదగిరి, కృష్ణా, రాయచూర్, మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం టౌన్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటాయి. తిరిగి కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు (07066) జనవరి 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 06.10 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటిరోజు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటాయి.

మౌలాలి-కొట్టాయం మధ్య 10 సర్వీసులు

జనవరి 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలిలో ప్రత్యేక రైలు (07167) మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, కోయంబత్తూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా మరుసటిరోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరేకుంటాయి. కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు(07168)కొట్టాయంలో జనవరి 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 01.30 గంటలకు చేరుకుంటాయి.

కాచిగూడ-కొట్టాయం మధ్య 8 సర్వీసులు

కాచిగూడలో జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ప్రత్యేక రైళ్లు(07169) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్ స్టేషన్ల మీదుగా సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయం చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైళ్లు(07170) జనవరి 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయంలో రాత్రి 8.50 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 1 గంటకు కాచిగూడకు చేరుకుంటాయి.

హైదరాబాదు మౌలాలి-కొల్లం మధ్య 8 సర్వీసులు

మౌలాలిలో ఈ ప్రత్యేక రైళ్లు (07171) జనవరి 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి భువనగిరి, జనగాం, ఖాజీపేట్, వరంగల్, కెసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొడనూర్, పాల్‌కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనచ్చేరి, తిరువళ్ల, చెంగనూర్ స్టేషన్ల మీదుగా మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు కాయకొల్లాంకు చేరుకుంటాయి. తిరిగి ఈ ప్రత్యేక రైలు (07172) కాయకొల్లంలో జనవరి 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 2.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు చేరుకుంటాయి.

12న ఉచిత వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలపేటలోని పెల్లేటి రామిరెడ్డి క్లబ్‌లో ఈనెల 12వ తేదీన ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు కోడూరు మీరారెడ్డి, సీనియర్ సభ్యుడు శ్రీకంటి రామమోహన్‌రావు తెలిపారు. సోమవారం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజల కోసం నెల్లూరుకు చెందిన కిమ్స్(బొల్లినేని) సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంత, కంటి, మెదడు, నరాలు తదితర అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేముల శ్రీధర్, నవీన్‌జయకుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మోటర్ సైక్లిస్ట్ మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - అన్నమేడు క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారిపై మోటర్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాయుడుపేట మండలంలోని వేముగుంటపాళెం గ్రామానికి చెందిన మనోహర్(55) సోమవారం రాత్రి పట్టణంలో నుంచి మోటర్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా అన్నమేడు క్రాస్ వద్ద నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మనోహర్ మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

గూడూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం సోమవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. వివరాల కోసం 8639835953 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

వెలుగు, సచివాలయాల ప్రాంగణాలకు మోక్షం



వెలుగు కార్యాలయం వద్ద గ్రావెల్ తోలిస్తున్న టీడీపీ నేతలు

కోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోటలోని వెలుగు కార్యాలయం, సచివాలయాలకు మోక్షం కలిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆయా కార్యాలయాల ఆవరణలో మోకాటి లోతు వరకు నీళ్లు ఉండిపోయాయి. దీంతో ఆయా కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందితో పాటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆయా ప్రాంగణాల్లో గ్రావెల్ లెవలింగ్‌కు తన సొంత నిధులతో శ్రీకారం చుట్టారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, వెంకన్నపాళెం సర్పంచు మధుయాదవ్, నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లో గ్రావెల్ లెవలింగ్ చేస్తున్నారు.

గ్రావెల్ టిప్పర్ల అడ్డగింత



టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలుపుతున్న స్థానికులు

చిల్లకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం గ్రామం మీదుగా వెళుతున్న గ్రావెల్ టిప్పర్లను స్థానికులు సోమవారం అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామం మీదుగా సాగరమాల రోడ్డు నిర్మాణ పనుల కోసం టిప్పర్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నారని, దీంతో రోడ్డు దెబ్బతినడంతో పాటు దుమ్ము లేచి ఇళ్లలోని, సమీప దుకాణాల్లో చేరుతోందన్నారు. దుమ్ము లేవకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంతో పాటు రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ చీఫ్ సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటాచలపతి, సీనియర్ నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు